
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 14.10.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 19 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## ప్రచారమే తప్ప...

# ప్రగతి ఏది?



◆ రాజధానిపై వున్న శ్రద్ధ రాష్ట్ర ప్రజలపై లేదు

**ఈ దేశంలో ఎందరో మహానాయకులు జన్మించారు. రాజుల కాలం నుండి నేటి ప్రజాస్వామ్య కాలం దాకా ఈ భూమిని ఎంతోమంది మహానుభావులు పరిపాలించారు. చరిత్రలో నిలిచిపోయే అద్భుతాలు చేశారు. ప్రజల గుండెల్లో నిలిచిపోయే పనులు చేపట్టారు. కాని మనకు తెలిసిన చరిత్రలో ఏ రాజు కాని, ఏ పాలకుడు గాని ఇది నేను చేశాను, అది నేను చేశాను అని చెప్పుకోలేదు. 'నేను' అన్న మాటను వదిలేసి 'మనం' అన్న భావనతోనే ముందుకు వెళ్లారు.**

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం 'మనం' అన్న పదాన్ని వదిలేసి 'నేను' అన్న మాటకే అంకితమైపోయాడు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసింది నేనే, హైటెక్ సిటీని కట్టింది నేనే, సెల్‌ఫోన్‌లు తెచ్చింది నేనే, కంప్యూటర్‌లు కనిపెట్టింది నేనే... డబ్బులు లేకుండానే ఎన్నో అద్భుతాలు సృష్టించాం... ఇప్పుడు ప్యాకేజీ వస్తే స్వర్గమే నిర్మిస్తాం, పోలవరం ప్రాజెక్ట్‌ను కేంద్రమే కట్టలేకపోయింది... అందుకే నాకు అప్పగించింది. ప్రపంచ దేశాలకే నేను పాఠాలు చెప్పాను... ఏమిటీ సెల్ఫ్ సోదంతా! ఒక ముఖ్యమంత్రి స్థాయిలో వున్న నాయకుడికి ఈ సొంత భజన అవసరమా? వినడానికే ఇది తన కాళ్లను తాను ఒత్తుకుంటున్నట్లుగా, తన భుజాన్ని తాను శెభాష్ అని తట్టుకుంటున్నట్లుగా లేదా? మన గొప్పతనాన్ని అవతలివారు గుర్తిస్తే అది ప్రశంస, మనం చెప్పుకుంటే కంఠశోష! అసలు ముఖ్యమంత్రిగా ఆయన ఏం వెలగబెట్టాడని ఈ గొప్పలు. ఆయన అంత అద్భుతంగా పరిపాలించి వుంటే 2004 ఎన్నికల్లో ఎందుకు ఓడిపోయినట్లు? అసలు వైయస్ అన్న నాయకుడే ఉండుంటే చంద్రబాబు ఎక్కడుండేవాడు!

ఒక నాయకుడి పరిపాలన అద్భుతంగా వుందని ప్రజలు చెప్పుకోవాలి. అంతేగాని తనకు తాను చెప్పుకోకూడదు.

(మిగతా 11వ పేజీలో)




## వీడని...

# 'అమ్మ' టెన్షన్

• ప్రతిపక్షం అ'టెన్షన్'



**తమిళనాడు రాజకీయాల్లో పురచ్చితలైవి జయలలిత ఎప్పుడూ సంచలనమే! అధికారంలోకొచ్చినా సంచలనమే, ప్రతిపక్షంలో కూర్చున్నా సంచలనమే! దత్తపుత్రుడికి పెళ్లి చేసినా సంచలనమే! సిబిఐ దాడులు జరిగినా సంచలనమే!**

**ఈ** సంచలనాలన్నీ ఒకెత్తయితే ఇప్పుడు ఆమె అనారోగ్యం కూడా తమిళనాడులోనే కాదు, దేశ వ్యాప్తంగా సంచలమైంది. దాదాపు 20రోజులుగా చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో ఆమె చికిత్స పొందుతున్నారు. తీవ్రమైన జ్వరంతో ఆమెను ఆసుపత్రిలో చేర్చగా తర్వాత కిడ్నీలు, కాలేయం, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లు గుర్తించి చికిత్స చేస్తున్నారు. లండన్ నుండి వైద్యులను పిలిపించారు. ఢిల్లీలోని ఎయిమ్స్ వైద్యులు వచ్చి ఆమె చికిత్సను పర్యవేక్షిస్తున్నారు. మీడియాలో రకరకాల కథనాలు వస్తున్నాయి. జయలలితను ఒక దేవతగా ఆరాధించే తమిళులకు కంటికి కునుకు, కడుపుకు తిండి లేదు. అమ్మ కోలుకోవాలంటూ పూజలు చేస్తున్నారు. నాలుకలకు శూలాలు గుచ్చుకుని తమ భక్తిని ప్రదర్శిస్తున్నారు. జయలలిత ఆరోగ్యంగా తిరిగి రావాలని కనిపించిన దేవుడికల్లా మొక్కుతున్నారు.

ఆసుపత్రిలో ఆమెకు వెంటిలేటర్ మీద చికిత్స అందిస్తున్నారు. ఆమె శరీరం చికిత్సకు సహకరిస్తుందని, త్వరలోనే కోలుకుంటుందని అప్పుడప్పుడు వైద్యులు హెల్త్‌బులెటిన్‌లు విడుదల చేస్తున్నారు.

ఇంకో పక్క తమిళనాట రాజకీయాలు సెగ పుట్టిస్తున్నాయి. జయలలితకు వారసులమంటూ ఆమె బంధువులు తెరపైకి

(మిగతా 11వ పేజీలో)



## పచ్చ పైత్యాన్ని వదిలిస్తున్న...

# సోషల్ మీడియా!

**చంద్రబాబు పరిపాలన అద్భుతంగా ఉందని పచ్చ పత్రికలు ఎంతైనా డప్పు కొట్టుగాక... చంద్రబాబు దేశంలోనే నెంబర్ వన్ సీఎం అని ఎల్లో ఛానెల్స్ అదేపనిగా ఏకరువు పెట్టుగాక... రాష్ట్ర ప్రజలకు చేరాల్సిన నిఖార్సయిన సమాచారం చేరుతూనే వుంది. ఏది మంచి, ఏది చెడు, ఏ పని ఎవరు ఎందు కోసం చేస్తున్నారన్నది ప్రజలకు తెలుస్తూనే వుంది.**

ఈరోజు రాష్ట్రంలో దాదాపు 80శాతం మీడియా అధికారపార్టీ వైపే వుంది. నిద్ర లేచింది మొదలు నీతి, నిజాయితీల గురించి మాట్లాడే మీడియా ప్రతినిధులు... 50వేల ఎకరాల పచ్చటి పొలాలను రియల్ ఎస్టేట్ లేఅవుట్లుగా మారుస్తుంటే ఇదేమని ప్రశ్నించలేదు. పోలవరం పూర్తయితే ఎందుకూ అక్కరకు రాని పట్టిసీమకు 1500కోట్లు తగలబెడుతుంటే ఈ మీడియా వేలెత్తి చూపలేదు. గోదావరి, కృష్ణ పుష్కరాల పేరుతో అచ్చంగా 4వేల కోట్లు నీళ్లలో పోస్తే ప్రశ్నించలేదు. ఇంకా పనికిమాలని ఖర్చు ఎంతో వుంది. ఈరోజు మన

(మిగతా 11వ పేజీలో)



## సాయి దర్బార్‌లో
# మహాసమాధి మహోత్సవాలు





నెల్లూరు బాలాజీనగర్ చివర పద్మావతినగర్‌లోని శ్రీ సాయి దర్బార్ అద్దాల మందిరంలో శ్రీ సాయి బాబా 98వ మహాసమాధి (ఆరాధన) మహోత్సవాలు ఈ నెల 10 నుండి 12వ తేదీ వరకు వైభవంగా జరిగాయి. 10వ తేదీ ఉదయం 7గంటల నుండి శిరిడి సాంప్రదాయం ప్రకారం శ్రీ సాయిబాబా భిక్షాటనం పద్మావతినగర్, బాలాజీనగర్, ఏసి నగర్, సరస్వతి నగర్ పురవీధుల్లో జరిగింది. 11వ తేదీ విజయదశమి రోజున శ్రీ సాయినాధునికి ప్రత్యేక అభిషేకాలు, ఉదయం 6గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు ఓం సాయి, శ్రీసాయి, జయజయసాయి అఖండ శ్రీ సాయినామ సంకీర్తనలు జరిగాయి. అనంతరం విష్ణు సహస్రనామము సామూహిక పారాయణము, శ్రీసాయి సచ్ఛరిత్ర పారాయణం, పల్లకి ఉత్సవం, హారతులు వైభవంగా జరిగాయి. 12వ తేదీ ఉదయం 8గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు 'శ్రీ సాయి సచ్ఛరిత్రము' పూర్తి గ్రంథము అఖండ పారాయణము జరిగింది. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబా వారిని దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ వ్యవస్థాపకులు మధుసాయి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి.



ఈ నెల 9న గుంటూరులో జరిగిన డిస్ట్రిక్ట్ 203 జిల్లా సమావేశంలో అత్యుత్తమ సమాజ సేవలు అందించినందుకుగాను నెల్లూరు జడ్పీ వాకర్స్ అసోసియేషన్ నుండి ఉత్తమ అధ్యక్షులుగా చలంచర్ల భాస్కర్‌రెడ్డి, ఉత్తమ కార్యదర్శిగా జెయస్ఆర్ ఆంజనేయులు, ఉత్తమ జోనల్ ఛైర్‌పర్సన్‌గా మండువ శ్రీనివాసరావు, ఉత్తమ రచయితగా బిరుదవోలు రామిరెడ్డి అవార్డులు అందుకున్నారు.

# భక్తజన సాగరం.. స్వర్ణాల తీరం



మత సమైక్యతకు, సామరస్యానికి ప్రతీకగా నిలిచే నెల్లూరులోని బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ ఈ నెల 12వ తేదీ నుండి ప్రారంభమైంది. కోరిన కోర్కెలు తీర్చే వరాల వేడుకగా ఈ పండుగకు పేరు. ఏ కోరికతో రొట్టె వదిలితే ఆ కోరిక నెరవేరుతుందన్న నమ్మకమే లక్షలాది మంది భక్తులను దేశ విదేశాల నుండి ఇక్కడకు నడిపిస్తుంటుంది. 12వ తేదీ నుండే దర్గాకు భక్తులు పోటెత్తినట్లు వస్తున్నారు. నెల్లూరులో ఏ.సి స్టేడియం, పోలీసు గ్రౌండ్‌లను ఆధునీకరిస్తుండడంతో ఇతర ప్రాంతాల నుండి వచ్చే వాహనాలకు ప్రత్యామ్నాయ స్థలాలలో పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. దర్గా ఆవరణలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా పోలీసులు అనుక్షణం డ్రోన్‌లు, సి.సి. కెమెరాలతో పహారా కాస్తున్నారు. 13వ తేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రొట్టెల పండుగకు వచ్చారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలని కోరుతూ ఆయన రొట్టెను వదిలారు. అలాగే బారాషహీద్‌లను దర్శించుకుని ప్రార్ధన చేశారు. మంత్రులు శిద్ధా రాఘవరావు, పి.నారాయణలు కూడా రొట్టెలు వదిలారు. 14వ తేదీ ప్రతిపక్ష నేత, వైకాపా అధ్యక్షులు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి రొట్టెల పండక్కి వస్తున్నారు. రొట్టెల పండుగ ఈ నెల 16వ తేదీతో ముగియనుంది. ఈ అయిదు రోజుల్లో దాదాపు 10లక్షల మంది భక్తులు ఈ రొట్టెల పండక్కి రావచ్చని అంచనా! ఇరు తెలుగు రాష్ట్రాలనుండే కాక తమిళనాడు, కర్నాటక, కేరళ, ఒడిసా తదితర రాష్ట్రాల నుండి కూడా భక్తులు పోటెత్తుతున్నారు.

సింహపురి సమాచారం

కృష్ణపట్నం పోర్టు కంపెనీ, సిఎంఆర్ షాపింగ్‌మాల్, మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, వివిధ స్వచ్ఛంధ సంస్థలు భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు, మంచినీళ్ల వంటివి అందిస్తున్నాయి. పలువురు వైద్యులు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.



రాష్ట్రానికి ప్రత్యేకహోదా రావాలని కోరుతూ రొట్టెను వదులుతున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పనబాక కృష్ణ మరియు ఇతర కాంగ్రెస్ నాయకులు



భక్తులకు నిరంతరం మినరల్ వాటర్ సరఫరా చేస్తూ దాహం తీరుస్తున్న మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి సభ్యులు







# శ్రద్ధాంజలి



02.09.1994 10.10.2016

## AKHIL BOMMU

# WE MISS YOU AKHIL

శోకతప్త హృదయాలతో...

కుటుంబసభ్యులు, ఆప్తులు, ఆత్మీయులు మరియు మిత్రులు

**ఉత్తరక్రియలు:** తేది.20.10.2016 గురువారం ఉదయం 11.30గంటలకు హైదరాబాదు, మాదాపూర్‌లోని "ఇమేజ్ గార్డెన్స్" నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

## 'ప్రభా'తం

# దేశ రక్షణతో ఆటలా?



**ప్రపంచమంతా కూడా భారత సైనిక చర్యను సమర్థిస్తుంటే, మన దేశంలో గబ్బు రాజకీయాలు మాత్రం దీనిని సైతం వివాదాస్పదంగా మార్చాయి. ఎప్పుడూ వివాదాలతో కలిసి కాపురం చేస్తుండే ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఓ పక్క ఇన్నాళ్లకు నరేంద్ర మోడీ దేశానికి ప్రధానిలా వ్యవహరించారంటూ ఇంకోపక్క సర్జికల్ స్ట్రైక్స్‌కు ఆధారాలు కావాలని డిమాండ్ చేయడం పెనుదుమారం రేపింది. ఇంకొందరు కాంగ్రెస్ నాయకులు అరవింద్ కేజ్రీవాల్ బాటనే పట్టారు.**

వ్యక్తి కంటే వ్యవస్థ ముఖ్యం. వ్యవస్థ కంటే దేశం ముఖ్యం. మన దురదృష్టమేంటంటే దేశం కంటే రాజకీయ పార్టీలు, రాజకీయ పార్టీల కంటే వ్యక్తులు ముఖ్యమైపోతున్నారు. మనమంతా భారతీయులం అన్న భావానికి చివరి ప్రాధాన్యత కల్పిస్తూ నాది ఫలానా కులం అన్న భావానికి మొదటి ప్రాధాన్యతనిస్తున్నారు. దేశ రక్షణ, భద్రతా పరమైన అంశాలతో సైతం రాజకీయ చదరంగం ఆడేలా పరిస్థితులు మారిపోయాయి. దేశంలో వ్యక్తి స్వేచ్ఛ, వాక్స్వాతంత్ర్యం హద్దులు దాటి పోయింది. చివరికి ఈ వాక్స్వాతంత్ర్యం ఎంత దాకా పోయిందంటే దేశాన్ని కంటికి రెప్పలా కాపాడే సైనికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే స్థాయికి చేరింది. ఇదెవరో పాకిస్థాన్ తొత్తులు చేస్తున్న పనైతే సరిపెట్టుకోవచ్చు. ముప్పొద్దులా ఇక్కడ తిండి తింటూ ఈ నేల గాలి పీలుస్తూ, ఇక్కడ బ్రతికే కొన్ని స్వార్థశక్తులు తమ నోటిదూలలతో దేశ రక్షణకు సంబంధించిన అంశాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ పరోక్షంగా మన శత్రుదేశానికి లేని బలాన్ని అందిస్తున్నారు.

యూరి సెక్టార్ దాడికి ప్రతీకారంగా పారా కమెండోలు పిఓకెలో సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించి పలు ఉగ్రశిబిరాలను ధ్వంసం చేయడంతో పాటు కొందరు ఉగ్రవాదులను మట్టుబెట్టిన చర్యపై ప్రపంచ దేశాలన్నీ సానుకూలంగా స్పందించాయి. కుక్క కాటుకు చెప్పుదెబ్బలా అభివర్ణించాయి. భారత సైన్యం జరిపిన సర్జికల్ స్ట్రైక్ ద్వారా పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు ఆశ్రయం పొందుతున్నారనే విషయం లోకానికి వెల్లడైంది. ఉగ్రవాదులకు పాక్ మిలటరీయే శిక్షణనిస్తుందన్నది బహిర్గతమైంది. పిఓకెలో ప్రవేశించి ఉగ్రవాద శిబిరాలను మట్టుబెట్టడం ద్వారా మన సైనికులలోనూ ఎనలేని ఉత్సాహం వచ్చింది.

ఉగ్రవాదం విషయంలో ఇప్పటిదాకా మన ప్రభుత్వాలు అనుసరించిన విధానం వేరు. ఉగ్రవాదులు దాడిచేసి మన సైనికులను, పౌరులను హతమార్చినప్పుడల్లా కన్నెర్రజేసే వాళ్లం, ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేస్తామని మన ప్రధాని, రక్షణమంత్రులు పాత ప్రకటననే తిరిగి తేదీ మార్చి ఫ్రెష్‌గా ప్రెస్‌కు పంపేవాళ్లు. మన దర్యాప్తు బృందాలు ఈ ఉగ్రదాడికి పాల్పడింది పాకిస్థాన్ నుండి వచ్చిన ఉగ్రవాదులేనంటూ సాక్ష్యాలు సేకరించి పాకిస్థాన్‌కు పంపేవాళ్లు. పాకిస్థాన్ ప్రభుత్వం ఆ ఆధారాలను ఉగ్రవాద శిబిరాలకు పంపి, ఇక ముందు జరిపే దాడుల్లో పాకిస్థాన్‌కు సంబంధించిన ఆధారాలు దొరక్కుండా జాగ్రత్తలు తీసుకోమని చెబుతుండేది. ఇలా జరిగిపోతూ వస్తుంది. యూరీ దాడి తర్వాతే కేంద్రప్రభుత్వం 'కన్నుకు కన్ను' సిద్ధాంతానికి శ్రీకారం చుట్టింది. ఉగ్రదాడులపై పంథా మార్చింది. ఉగ్రవాదులు సరిహద్దులు దాటొచ్చి మన మీద దాడి చేయకముందే మనమే పరిధులు దాటెళ్లి ఉగ్ర శిబిరాలను తుద ముట్టించాలని నిర్ణయించింది. భారత సర్జికల్ స్ట్రైక్స్‌తో పాకిస్థాన్ బిత్తరపోయింది. ఇండియా వైపు నుండి ఇలాంటి అటాక్ జరగుతుందని వాళ్లు కలలో కూడా ఊహించి వుండరు. కేవలం ఉగ్రశిబిరాలనే తుద ముట్టించడం ద్వారా భారత సైనిక చర్యలను ప్రపంచ దేశాలన్నీ సమర్థించాయి. అగ్రదేశాలన్నీ కూడా పాకిస్థాన్‌ను తలవాచేలా చీవాట్లు పెట్టాయి. దౌత్యపరంగా పాకిస్థాన్ ఒంటరిదైపోయింది. ప్రధాని నరేంద్రమోడీ రెండున్నరేళ్ల కాలంగా చేసిన దౌత్య ఫలితమే ఇది. ఆఖరకు సార్క్ దేశాలు సైతం పాకిస్థాన్‌లో తలపెట్టిన సార్క్ సదస్సును బహిష్కరించడం పాక్‌కు తలవంపులు తెచ్చింది. ఈ దెబ్బకు పాకిస్థాన్ ఒక దేశంగా కాక ఒక ఉగ్రవాద తండాగా గుర్తింపబడింది. ప్రపంచమంతా కూడా భారత సైనిక చర్యను సమర్ధిస్తుంటే, మన దేశంలో గబ్బు రాజకీయాలు దీనిని సైతం వివాదాస్పదంగా మార్చాయి. ఎప్పుడూ వివాదాలతో కలిసి కాపురం చేస్తుండే ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఓ పక్క ఇన్నాళ్లకు నరేంద్ర మోడీ దేశానికి ప్రధానిలా వ్యవహరించారంటూ ఇంకోపక్క సర్జికల్ స్ట్రైక్స్‌కు ఆధారాలు కావాలని డిమాండ్ చేయడం పెనుదుమారం రేపింది. పాకిస్థాన్ పత్రికలైతే అరవింద్ కేజ్రీవాల్‌ను హీరోను చేసి, ఆ విషయాన్ని పతాకశీర్షికల్లో ప్రచురించాయి. ఇంకొందరు కాంగ్రెస్ నాయకులు అరవింద్ కేజ్రీవాల్ బాటనే పట్టారు. సర్జికల్ స్ట్రైక్స్ మీద అనుమానాలు వ్యక్తం చేశారు. కాంగ్రెస్ యువరాజు రాహుల్‌గాంధీ అయితే ముందు రోజు సర్జికల్ స్ట్రైక్స్‌పై కేంద్రప్రభుత్వాన్ని అభినందిస్తూ, పక్కరోజు మాత్రం సైనికుల రక్తంతో బీజేపీ రాజకీయం చేస్తుందంటూ ఆరోపణలు గుప్పించాడు. సర్జికల్ స్ట్రైక్స్ మూలంగా బీజేపీ ఎక్కడ రాజకీయ లబ్ది పొందుతుందన్న ఆందోళన ఆయన మాటల్లో వ్యక్తమైంది. సర్జికల్ స్ట్రైక్స్ అంశానికి అన్ని పార్టీలు కలిసి రాజకీయ రంగు పులిమాయి. దేశ రక్షణ విషయంలో ఒక ప్రభుత్వం గట్టిగా వ్యవహరించినప్పుడు, సంబంధిత ప్రభుత్వానికి మైలేజీ తప్పకుండా వస్తుంది. ఇందిరాగాంధీ హయాంలోనూ పాకిస్థాన్‌తో యుద్ధం జరిగింది. ఆనాడు వాజ్‌పేయి వంటి నాయకుడు ఇందిరను అభినవ దుర్గగా అభివర్ణించారు. బంగ్లాదేశ్ విభజన యుద్ధంలో భారత సైనికులు చనిపోలేదా? మరి ఆరోజు కూడా ఇందిరాగాంధీ సైనికుల రక్తంతో రాజకీయం చేసినట్లేనా? కార్గిల్ యుద్ధ విజయంతో *1999* ఎన్నికల్లో ఎన్డీఏ ప్రభుత్వం రెండోసారి గెలిచింది. కార్గిల్ విజయాన్ని వాజ్‌పేయికి ఆపాదించకుండా చేయగలమా? *2004* నుండి *2014* మధ్య దేశంలో ఎన్నో ఉగ్రదాడులు జరిగాయి. ఆనాటి యూపిఏ ప్రభుత్వం దేశ భద్రత విషయంలో నిమ్మకు నీరెత్తిందన్న ఆరోపణలు ఇప్పటికీ ఉన్నాయి. యూపిఏ హయాంలోనూ సర్జికల్ దాడులు చేసామని ఆనాటి రక్షణ మంత్రి శరద్‌పవార్ ఈరోజు చెప్పొచ్చుగాక... ఈరోజు చెప్పిన దానివల్ల ఉపయోగం లేదు. శత్రుదేశాలు, ఉగ్రదాడుల విషయంలో దెబ్బకు దెబ్బ తీయడమే ప్రధాన సిద్ధాంతం. దేశ ప్రజలు కోరుకునేది కూడా అదే! అవతలి వాడు శాంతి కాముకుడైతే మనం యుద్ధాలను, ప్రతీకార దాడులను ఆక్షేపించవచ్చు. కాని అవతల పాకిస్థాన్ పెద్ద కాలనాగు. ఎప్పుడూ మనపై విషం కక్కుతూనే వుంటుంది. కాబట్టి దాని కోరలు పీకేలా వ్యవహరించిన ప్రధాని నరేంద్ర మోడీ ధైర్యాన్నే ఈరోజు దేశ ప్రజలు ఆమోదిస్తున్నారు. అంతేగాని దేశ భద్రతతో, సైనికుల ఆత్మస్థైర్యంతో ఆటలాడే చెత్తరాజకీయాలను కాదు!

# గుడిసెలు కూల్చేయడం పద్ధతి కాదు

### బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపురెడ్డి

నెల్లూరు నగరంలో అక్రమ కట్టడాల పేరుతో పేదల గుడిసెలు కూల్చడం పద్ధతి కాదని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం నెల్లూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ దశాబ్దాలుగా కాలువగట్లపై నివాసముంటున్న పేదలను తక్షణం ఖాళీ చేయాలని, లేకుంటే గుడిసెలను కూల్చేస్తామంటూ వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ప్రత్యామ్నాయం చూపించిన వెంటనే గుడిసెలను తొలగించాలని సూచించారు.

ఈ సమావేశంలో పార్టీ నేతలు మద్దు శ్రీనివాసులు, నారాయణ, శ్రీనివాసులురెడ్డి, మాల్యాద్రి, సుధాకర్‌రెడ్డి, రాధాకృష్ణ, భాస్కర్, కప్పిర శ్రీనివాసులు పాల్గొన్నారు.

# పట్టుదలతో ఉన్నతశిఖరాలు

విద్యార్థులు పట్టుదలతో చదువుకున్నప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని యానాది సంక్షేమసంఘం రాష్ట్ర ఛైర్మెన్ దశరథరామయ్య అన్నారు. నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి భవన్‌లో ఈ నెల 9న జరిగిన యానాది సంఘం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం గిరిజన యువత సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్టీఆర్ విద్యోన్నతి ద్వారా అందించే సివిల్స్ కోచింగ్‌ను గిరిజనులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సహాయ సంక్షేమ అధికారి జ్యోత్స్న, నాయకులు పెంచలయ్య, చంద్రమౌళి, కొమరగిరి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి చిరునామా నారాయణ

### - కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ మున్సిపల్ మంత్రి నారాయణ అని, ఆయనను విమర్శించడానికి నీకు నోరెలా వచ్చిందని తెలుగుదేశం పార్టీ నెల్లూరు నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్‌పై ధ్వజమెత్తాడు. కంటి నిండా నిద్ర, కడుపు నిండా తిండి కూడా లేకుండా మంత్రి నెల్లూరుజిల్లా అభివృద్ధి కోసం అనుక్షణం తపనపడుతున్నాడని, అలాంటి ప్రగతి తపస్విని తిట్టడానికి మనసెలా వచ్చిందని ప్రశ్నించాడు. నగర అభివృద్ధిని గురించి నువ్వెప్పుడన్నా ఆలోచించావా? అసలు నీ నియోజకవర్గంలో ఏం సమస్యలున్నాయో నీకు తెలుసా? నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కావాలని, ఏ రోజన్నా మంత్రిని గాని, ఎమ్మెల్సీ బీద రవిచంద్రను కాని కలిసావా? నెల్లూరులో 1100కోట్ల హడ్కో నిధులతో అభివృద్ధి పనులు జరుగుతుంటే వాటిని కూడా విమర్శిస్తావా? అంటూ అనిల్‌పై విరుచుకుపడ్డారు. గత ఏడాది వర్షాల వల్ల నెల్లూరు మునిగిపోయింది. మరోసారి అలాంటి పరిస్థితి తలెత్తకుండా చేసేందుకు కాలువలపై ఆక్రమణలు తొలగిస్తుంటే వాటికి కూడా అడ్డుపడడం శోచనీయమన్నారు.

ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామి నాయుడు, తెలుగుదేశం నాయకులు ధర్మవరం సుబ్బారావు, భవనేశ్వర ప్రసాద్, మెయినుద్దీన్, కృష్ణమూర్తి, మల్లి తదితరులు పాల్గొన్నారు.




## అనవసర ప్రేలాపనలు

ఈ దేశానికేమైంది... ఒకడు టెన్త్ ఫెయిలైన వాళ్లే సైన్యంలో చేరుతారంటాడు... ఇంకో వెధవ... వాళ్లను ఆర్మీలో చేరమన్న దెవరు? ప్రాణాలు పోగొట్టుకోమన్నదెవరంటాడు? ఇంకో పనికిమాలినోడు సర్జికల్ స్ట్రైక్ జరిగిందనడానికి ఆధారాలేంటంటాడు. నాకు ఫలానావాళ్లే తల్లిదండ్రులు అన్నది ఓ నమ్మకం. దానికి ఆధారమేంటంటే సమాధానం ఏముంటుంది. రాజకీయపార్టీల మధ్య ఎన్ని విభేదాలైనా వుండొచ్చు. వివిధ సంఘాల మధ్య సైద్ధాంతిక వైరం ఉండొచ్చు. కాని దేశ భద్రత విషయంలో ఈ వివాదాలేంటి? భారత సైన్యం ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీసేలా ఈ కారుకూతలేంటి? ఇలాంటి పనికిమాలిన వాళ్లను దేంతో కొట్టాలి?

**సి. రాజీవి, నెల్లూరు.**

## లోకేష్‌కు అంత సీన్ లేదు

జగన్‌లా తండ్రికి తలవంపులు తేనని బుద్ధిమంతుడు లోకేష్‌బాబు చెప్పుకొచ్చాడు. ఈరోజు రాష్ట్రంలో జరుగుతున్న వేలకోట్ల అవినీతికి సూత్రధారి లోకేష్‌బాబు. అమెరికాలో చదువుతున్నప్పుడు అమ్మాయిలతో ఆయన దిగిన ఫోటోలే ఈ అబ్బాయి ఎంత బుద్ధిమంతుడో సూచిస్తున్నాయి. జగన్‌లా తన చిన్నాన్న చేత రాజీనామా చేయించి పోటీ చేయనన్నాడు. తమ తండ్రి గారు తమరిని అంత దూరం రానిస్తాడా? మీ చిన్నానను ఎప్పుడో తెరమరుగు చేశాడు. ఇప్పుడు మీ బాబాయ్ పరిస్థితి ఏంటో నీకు తెలిసే వుండాలి. వై.యస్. సీఎంగా వుండగా జగన్ ఏరోజూ సచివాలయంకు రాలేదు. మరి నువ్వు ఏ హోదా లేకపోయినప్పటికి ఏకంగా క్యాబినెట్ మీటింగ్‌లలోనే కూర్చుంటున్నావు. కొంచెమన్నా ప్రజాస్వామ్యం పట్ల విలువ, గౌరవం వుంటే ఈ పని చేయరు!

**పి. వాసు, శ్రీకాళహస్తి.**

## తెలుగు తెల్లారుతోంది!

తెలుగు వాడకం తెల్లారిపోతోంది. రామోజీరావు కొంత ఫర్వాలేదు. తెలుగు వాడకానికి ప్రాధాన్యతనిస్తున్నారు. మండలి బుద్ధప్రసాద్ తెలుగు భాషాభిమాని అయినప్పటికీ టైమంతా నిద్రపోయేదానికే సరిపోతోంది. అసెంబ్లీలో అధికార, ప్రతిపక్షాలు ఇంగ్లీష్‌లోనే తిట్టుకుంటున్నాయి, కొట్టుకుంటున్నాయి. తెలుగు రాష్ట్రాలు రెండైనా తెలుగు భాష మాత్రం ఒంటరిదైంది. గ్రామ సచివాలయం నుండి రాష్ట్ర సచివాలయం వరకు తెలుగు వాడకాన్ని తప్పనిసరి చేస్తూ ప్రభుత్వాలు శాసనాలు తేవాలి. తెలుగు వ్రాయని సిబ్బందిని తీసేయాలి.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

# మళ్లీ వాయిదా!

**ఏ పనన్నా సమర్ధవంతంగా పూర్తి చేయాలంటే ధైర్యమన్నా ఉండాలి, పక్కా ప్లానింగ్ అన్నా ఉండాలి. దురదృష్టం... మన పాలకుల వద్ద ఆ రెండూ లేకుండా పోయాయి. నెల్లూరు నగరంలో ఆక్రమణల తొలగింపు మళ్లీ వాయిదా పడింది. అదేదో పనికి ఆషాఢం సొద్దు దొరికినట్లు, ఆక్రమణలు తొలగించడానికి మన వాళ్లకు పండుగలు అడ్డొచ్చాయి.**

2015 నవంబర్‌లో వచ్చిన వరదలకు నెల్లూరు నగరంలో పలు కాలనీలు ముంపుకు గురికాగా, ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా వచ్చి పరిశీలించి కాలువలపై ఆక్రమణలను తొలగించాలని ఆదేశించడం తెలిసిందే! అప్పట్లో రెండ్రోజులు మంత్రి నారాయణ మిషన్‌లను తెప్పించి హడావిడి చేసాడు. నీ నారాయణ ఆసుపత్రి కూడా కాలువమీదే వుంది, కాబట్టి ముందు నీది పగలగొట్టుకో అని ఎమ్మెల్యేలు కోటంరెడ్డి, అనిల్‌లు హెచ్చరించేసరికి అసలు ఆక్రమణల తొలగింపే అటకెక్కింది. దాదాపు సంవత్సరం పాటు ఈ సబ్జెక్ట్‌ను కదిలించలేదు. మొన్న హైదరాబాద్‌లో వరదలు రావడం, కాలువల మీద ఆక్రమణలను కేసీఆర్ అడ్డంగా పగలగొట్టించడంతో చంద్రబాబుకు నెల్లూరు గుర్తొస్తుంది. మళ్లీ వర్షాల సీజన్ వస్తుంది. ఈసారి కూడా నెల్లూరులో సీన్ రిపీట్ అయితే జనం మనల్ని తిట్టుకుంటారు. వెంటనే ఆక్రమణల తొలగింపు చేపట్టండని ఆదేశించడంతో మంత్రి నారాయణ రంగంలోకి దిగి పాత మ్యాప్‌లను మళ్లీ ఓపెన్ చేసి ఆక్రమణల తొలగింపుకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 8వ తేదీ రామిరెడ్డి కాలువపై మద్రాసు బస్టాండ్ ప్రాంతంలో కొంత ఉద్రిక్తత పరిస్థితి మధ్య ఆక్రమణలు తీసేయడం మొదలుపెట్టారు. 9వ తేదీకి మళ్లీ సీన్ రిపీట్! మూలాపేటలోని ఉమామహేశ్వరస్వామి గుడి సమీపంలో ఆక్రమణల తొలగింపును నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ అడ్డుకున్నారు. దీంతో అధికారులు, పోలీసులు ఏమీ చేయలేక వెనుదిరిగారు. 12వ తేదీ దసరా, ఆ తర్వాత రొట్టెల పండుగ వున్నాయి కాబట్టి, ఆ పండుగలు పోయాకే తిరిగి ఆక్రమణలు తొలగింపు చేపట్టాలని నిర్ణయించారు.

12వ తేదీ దసరా, ఆ తర్వాత రోజు నుండి రొట్టెలపండుగనే విషయం మన మంత్రికి, నగర పాలకులకు, అధికారులకు ముందుగా తెలియదా? అదేదో మొదలుపెట్టేది పండుగలు పోయాకే మొదలుపెట్టి ఉండొచ్చు కదా!

అసలు అంతదాకా ఎందుకు.. ఆక్రమణల తొలగింపుపై చిత్తశుద్ధి ఉండుంటే బాధితులకు ఈ గ్యాప్‌లోనే ప్రత్యామ్నాయం చూపించి ఉండొచ్చు. నెల్లూరు జంట ఎమ్మెల్యేలు కోరుకునేది కూడా బాధితులకు నీడకల్పించి, మౌలిక వసతులు ఏర్పాటు చేయమనే!

వైయస్సార్ నగర్‌లో బాధితులకు ఇళ్లు ఇస్తామని మంత్రి నారాయణ చెబుతున్నాడు. ఆ పనేదో కనీసం ఆరు నెలల ముందే చేసి ఉండొచ్చు. అక్కడ రోడ్లు, కరెంట్, తాగునీళ్ల వంటి కనీస వసతులు ఏర్పాటు చేసివుంటే ఈరోజు ఆక్రమణల తొలగింపుకు ఎవరూ అడ్డు పడేవాళ్లు కారు.

## ఆక్రమణలు తొలగించే పద్ధతి ఇదేనా?



# నిరూపిస్తే రాజీనామా చేస్తావా?

## - మంత్రికి అనిల్ సవాల్



నా కాలేజీలో ఒక్క అడుగు కూడా కాలువ ఆక్రమణ లేదంటున్నావ్... నీ కాలేజీకొస్తా... కాలువను ఆక్రమించి మీ కాలేజీ కట్టిన విషయాన్ని నిరూపిస్తా... నేను నిరూపిస్తే నువ్వు రాజీనామా చెయ్... నిరూపించలేకపోతే నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా... దీనికి మీరు సిద్ధమేనా? అంటూ నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ మున్సిపల్ మంత్రి పి.నారాయణకు సవాల్ విసిరారు. సోమవారం నెల్లూరులోని రాజన్నభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారాయణ మెడికల్ కాలేజీ కాలువ ఆక్రమణపై జిల్లా కలెక్టర్‌తో పాటు హైలెవల్ కమిటి వేసి నిజనిర్ధారణ చేయాలని డిమాండ్ చేశారు. నగరంలో 5000 కుటుంబాల భవిష్యత్ గురించి ఆలోచించకుండా ఉన్నట్లుండి పోలీసులను మోహరించి వారి ఇళ్లను కూల్చాలనుకోవడం ఉన్మాదమే అవుతుందని, మంత్రి నారాయణను తాను ఉన్మాదితో పోల్చడంలో ఏ మాత్రం తప్పులేదని అనిల్ పేర్కొన్నాడు. తనను సభ్యత నేర్చుకోవాలంటూ జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీద రవిచంద్ర అనడం కరెక్ట్ కాదని, సభ్యత గురించి తాము ఎవరి దగ్గరా పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదన్నారు. పేదల కొంపలను కూల్చి వారికి ఏ ఆసరా లేకుండా చేయడం సభ్యత అవుతుందా? అని అనిల్ ప్రశ్నించాడు. నీడ కోల్పోయే పేదలకు ప్రత్యామ్నాయం కల్పించి అందరి ఆమోదంతో ఆక్రమణలను తొలగించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేటర్లు రవిచంద్ర, అశోక్, నాగరాజు, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.




• ఆర్థరైటిస్ డే

# అపోలో ర్యాలీకి విశేష స్పందన





ఈ నెల 12వ తేదీన వరల్డ్ ఆర్థరైటిస్ డేను పురస్కరించుకుని ఆదివారం నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదిత్య నగర్‌లోని చిల్డ్రన్స్ పార్క్ నుండి అపోలో ఆసుపత్రి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎముకలు, కీళ్ల వ్యాధులపై అవగాహన కల్పిస్తూ సాగిన ఈ ర్యాలీకి ప్రముఖ ఎముకలు, కీళ్ల వ్యాధుల సీనియర్ వైద్యనిపుణులు డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి నేతృత్వం వహించారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్‌తో పాటు లయన్స్‌క్లబ్, రోటరీ క్లబ్, షార్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్, జైన్‌హబ్ అసోసియేషన్, చిల్డ్రన్స్ పార్క్ వాకర్స్ అసోసియేషన్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ర్యాలీ అనంతరం అపోలో ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ నెల్లూరు లాంటి నగరంలో అపోలో ఆసుపత్రి రావడం శుభ పరిణామమని, మనిషి ఆరోగ్యానికి ఎముకలు పటిష్టంగా ఉండడం ఎంతైనా అవసరమని, 30ఏళ్లు దాటాకా ప్రతి ఒక్కరూ సరైన వ్యాయామం చేస్తూ వైద్యుల సలహాలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్థోపెడిక్ విభాగంలో ఎన్నో ఆధునిక వైద్యచికిత్సలొచ్చాయని, కీళ్లు, ఎముకల వ్యాధులతో బాధపడేవాళ్లు సత్వరం వైద్యులను సంప్రదించి సరైన చికిత్స ద్వారా ఉపశమనం పొంద వచ్చున్నారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ సిటిజన్‌లు కీళ్లు, మోకాలి చిప్పల చికిత్స తర్వాత తాము ఎంత ఉల్లాసంగా, ఉత్సాహంగా వున్నామన్నది వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంకా డాక్టర్ వివేకానందరెడ్డి, డాక్టర్ మీరావలి, యూనిట్ హెడ్ నవీన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్వేతారెడ్డి, పిఆర్‌ఓ విజయకుమార్, పార్క్ వాకర్స్ సభ్యులు కొట్టే రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

# నెల్లూరంతా సందడి!

ఈ నెల 12వ తేదీ నుండి నెల్లూరు, దర్గామిట్టలోని బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండుగ మొదలు కావడంతో నగరమంతా సందడి నెలకొంది. బయట ప్రాంతాల నుండి నెల్లూరు నగరంలోకి వచ్చే రహదారులన్నీ వాహనాల రద్దీతో కిక్కిరిసిపోతున్నాయి. నెల్లూరు రోడ్లపై వాహనాల తాకిడి ఎక్కువైంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన మీద కంటే పుష్కరాలు, పండుగల మీదే ప్రత్యేకశ్రద్ధ చూపుతోంది. గతంలో ఎన్నడూ లేని రీతిలో రొట్టెల పండుగకు భారీ ఖర్చుతో ఏర్పాట్లు చేసింది.

# చుక్కలు చూపించిన పూలు



నవరాత్రుల పుణ్యమా అని మార్కెట్‌లో పూల ధరలు వినియోగదారులకు చుక్కలు చూపించాయి. సాధారణంగా ఎప్పుడూ కిలో వంద రూపాయలకు మించని రోజా, చామంతి పూలు... పండుగల రోజుల్లో 400రూపాయలు పలికాయి. బంతి, కదంబం వంటి ఇతర రకాల పూలధరలు సైతం చుక్కలనంటాయి. దేవుడి పూజకు పూలు కొనాలన్నా భక్తులకు జేబులు వెదుక్కోవాల్సిన పరిస్థితి వచ్చింది.

'మీ కోసం'లో

# జిల్లాకు 4వ స్థానం

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్న 'మీ కోసం' కార్యక్రమంలో నెల్లూరుజిల్లాకు 4వ స్థానం దక్కింది. ప్రజా విజ్ఞప్తుల దినంగా సోమవారం 'మీ కోసం' కార్యక్రమానికి అర్జీలు వెల్లువలా వస్తాయి. వివిధ శాఖల అధికారులు స్వీకరించిన అర్జీలను పరిష్కరించడానికి, అర్జీల వివరాలను తెలియజెప్పడానికి ప్రభుత్వం మీ కోసం కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం అమల్లోకి వచ్చిన తర్వాత అధికారులు స్వీకరించిన ప్రతి అర్జీ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి వాటి స్థితిగతులను ప్రతిరోజూ ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. ఈ విధానం వల్ల అర్జీలను పెండింగ్‌లో పెట్టడానికి అవకాశం ఉండదు. ప్రజల నుంచి తీసుకున్న అర్జీలను బుట్ట దాఖలు చేసే అవకాశం లేదు. అర్జీలకు పరిష్కారం చూపాల్సిందే. 'మీ కోసం' పోర్టల్‌ను ప్రభుత్వం ప్రత్యేకంగా అమలు చేయడంతో జిల్లాల వారీగా వివిధ శాఖల అర్జీలను ముఖ్యమంత్రి, రాష్ట్ర స్థాయి అధికారులు పరిశీలించే వీలుంటుంది. అర్జీల పరిష్కారంలో మొదటి పది స్థానాలను ఏరోజు కారోజు ప్రకటించడంతో అర్జీల పరిష్కారంలో జవాబుదారీతనం పెరిగింది. ఇలా చేయడం వల్ల 'మీ కోసం' కార్యక్రమానికి సంబంధించి అర్జీల పరిష్కారంలో జిల్లాకు 4వ స్థానం లభించింది. జిల్లాల్లో మొదటి స్థానంలో గృహనిర్మాణం, రెండవస్థానంలో సివిల్ సప్లైస్, మూడవ స్థానంలో వ్యవసాయం, 4వ స్థానంలో రెవెన్యూశాఖలున్నాయి.

# ఇంకా ఎండాకాలమేనా?

రాష్ట్రమంతా వర్షాలు పడ్డాయి. నెల్లూరుజిల్లాల్లో మాత్రం ఎండాకాలం కొనసాగుతూనే వుంది. మధ్య మధ్యలో చిరుజల్లులు పడుతున్నాయి. అసలు ఇది అక్టోబర్ నెలో, మే నెలో అర్థం కావడం లేదు. అంతగా కాస్తున్నాయి ఎండలు. అక్టోబర్ నెలలో కూడా ఏ.సిలు ఆన్ కానిదే ఇంట్లో నిద్రపట్టి చావడం లేదు. ఉక్కపోత కూడా అంతగా వుంది. అక్టోబర్‌లో కూడా ఆశించినంతగా వానలు పడ్డం లేదు. ఇక నవంబర్‌లోనన్నా వర్షాలు కురిసి వాతావరణం చల్లబడుతుందేమో చూడాలి!

# మలేషియాలో రంగమయూర్



ఈ నెల 9వ తేదీ నుంచి మలేషియాలో ఆంధ్రప్రదేశ్ డయాబెటిస్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన ప్రతిష్టాత్మకమైన యాన్యువల్ కాన్ఫరెన్స్‌లో నెల్లూరు 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఆరోగ్యశాఖా మంత్రి కామినేని శ్రీనివాస్‌ను కలిసి నెల్లూరు రాజకీయాలపై చర్చించారు.

# ప్రత్యేకహోదా కోసం ప్రత్యేకపూజలు



ఈ నెల 8న నెల్లూరులోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మ వారి దేవస్థానంలో ప్రత్యేకహోదా కోసం వైయస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు శేషగౌడ్ మాట్లాడుతూ ఈ రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వండి, ఆంధ్ర రాష్ట్ర ప్రజలను కాపాడండి అంటూ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్‌రెడ్డి గత రెండున్నర సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నా, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కానీ, ప్రధాని నరేంద్ర మోడీకి అర్థం కావడంలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఓటు-నోటు కేసులకు భయపడి కేంద్రం వద్ద లాలూచీపడి ఈ రాష్ట్రానికి ప్రత్యేకహోదాని కేంద్రం వద్ద తాకట్టుపెట్టి ప్యాకేజీకి సిద్ధమయ్యాడన్నారు. ఈ కార్యక్రమంలో నగర ప్రధానకార్యదర్శి వెంకటేష్, రూరల్ కన్వీనర్ మధు, నాయకులు సమీ, చందు, నవీన్, అనుదీప్, భార్గవ్, రాజా తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ కుటుంబానికి ఆర్థిక సాయం



ఇటీవల కలిగిరి పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ కుమార్ విధి నిర్వహణలో మృతి చెందారు. ఆయనకు ప్రభుత్వం నుంచి అన్ని రకాల ప్రయోజనాలు రావాల్సి వుంది. అవి వచ్చేందుకు కొంత ఆలస్యం కానుండటంతో పోలీస్ అధికారుల సంఘం అభ్యర్థన మేరకు జిల్లా పోలీసులు స్వచ్ఛందంగా రూ.50వేలను సేకరించి, మృతిచెందిన పోలీస్ కానిస్టేబుల్ కుటుంబానికి ఏపి పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావుల ద్వారా అందజేశారు. ఆర్ఎస్సై అంకమరావు, ఏఆర్ ఎస్సై గౌస్‌బాషా పాల్గొన్నారు.





# చందన, సిఎంఆర్ వీక్లీ డ్రా విజేతలు

దసరా, దీపావళి పండుగల సందర్భంగా నెల్లూరులోని చందన, సిఎంఆర్ షోరూంలు వినియోగదారుల కోసం ప్రత్యేక ఆఫర్లతో బంగారు, వస్త్రాలు విక్రయిస్తున్న నేపథ్యంలో జనతా సేల్‌లో భాగంగా ఆదివారం షోరూంకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న నెల్లూరు నగర డిఎస్పీ జి.వి.రాముడు చేతులమీదుగా 2వ వీక్లీ డ్రా తీసి విజేతలను ప్రకటించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ చందన, సిఎంఆర్‌లో తక్కువ ధరలకు బంగారు ఆభరణాలు, వస్త్రాలను విక్రయించడం అభినందనీయమన్నారు. గత వారం విజేతలైన వారికి డిఎస్పీ బహుమతులను అందజేశారు. షోరూం అధినేత ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ దసరా, దీపావళి స్కీంలను నెల్లూరు ప్రజలు విశేషంగా ఆదరిస్తున్నారన్నారు. రాజీయాడ్స్ అధినేత పెంచలయ్య మాట్లాడుతూ పండుగల సందర్భంగా చందన, సిఎంఆర్ షోరూంలలో తక్కువ ధరలకే రెడీమేడ్ వస్త్రాలు, చుడీదార్స్, శారీస్, షూటింగ్స్ షర్టింగ్స్, పిల్లల రెడీమేడ్స్, బంగారు ఆభరణాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ డ్రాలో కడపకు చెందిన ప్రసాద్‌రెడ్డి స్కూటీ గెలుపొందగా కె.విజయమ్మ రిఫ్రిజిరేటర్, పి.విజయమ్మ గ్రైండర్, ఎం.వి.సురచంద్ గ్రైండర్, జి.మాధవి మిక్సీ, కె.తనేష్ మిక్సీ, కె.అమర్‌నాథ్ మిక్సీ, ఎ.పద్మ రైస్‌కుక్కర్, టి.కామాక్షి రైస్‌కుక్కర్, పి.భారతి రైస్‌కుక్కర్ గెలుపొందారు.

# 108 కలశాలతో నగరోత్సవం



శ్రీ రాజరాజేశ్వరి అమ్మ వారి సేవాసమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో భవాని అమ్మవారి మాల ధారణ చేసిన భక్తులు 108 పవిత్ర పెన్నానది జలాల కలశాలతో 8వ తేదీ రాత్రి వైభవంగా నగరోత్సవాన్ని నిర్వహించారు. నెల్లూరు పాత మునిసిపల్ కార్యాలయం సమీపాన పెన్నానది నుంచి రాజరాజేశ్వరి అమ్మవారి మాలధారణ చేసిన సుమారు 1600మందికిపైగా భక్తులు పవిత్ర జలాలను సేకరించి తప్పెట్లు, మంగళవాయిద్యాలు, బ్యాండ్ మేళాలతో ఊరేగింపుగా సాగారు. సంతపేట సెంటర్, ఏసి సెంటర్, గాంధీబొమ్మ మీదుగా రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం వరకు నగరోత్సవం సాగింది. చండీ, భవాని, గాయత్రి, అన్నపూర్ణ, గజలక్ష్మి, మహాలక్ష్మి, కాళిక, సరస్వతి, దుర్గా అలంకరణలను ప్రత్యేక వాహనాల్లో కొలువుదీర్చి భక్తి శ్రద్ధలతో అమ్మవారి ఓం శక్తి నామస్మరణతో కోలాహలంగా సాగింది. మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం పాలక మండలి ఛైర్మన్ ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి, అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథస్వామి ఆలయ పాలక మండలి ఛైర్మన్ కొలపర్తి వెంకటరమేష్, భవానిమాల ధరించిన భక్తులు పాల్గొన్నారు.




ఏరు దాటాక తెప్ప తగలేసే విధానాలు తెలుగుదేశంపార్టీలో చాలా బాగా అమలవుతుంటాయి. ఏ టైంలో ఎవరు అవసరమో వారిని వాడుకోవడం, వాడకం పూర్తయ్యాక వదిలేయడం అక్కడి నైజం.

# వారిద్దరినీ వదిలేసారంతే!

2014 ఎన్నికల్లో తమ చొక్కాలు చింపుకుని చేతి చిలుం వదిలించుకున్న గూటూరు కన్నబాబు, రాధాజ్యోత్స్నలతలను కనీసం గుంటూరులో జరిగిన తెలుగుదేశం పార్టీ శిక్షణా తరగతులకు కూడా పిలవలేదు. వారి పరిస్థితి కూరలో కరివేపాకులా అయ్యింది. వైకాపా ఎమ్మెల్యేగా వున్న పాశం సునీల్‌కుమార్‌ను తెలుగుదేశంలో చేర్చుకోవడం ద్వారా గూడూరులో ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న జ్యోత్స్నలతకు, కాంగ్రెస్‌లో వున్న ఆనం రామనారాయణరెడ్డిని చేర్చుకోవడం ద్వారా ఆత్మకూరు ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న గూటూరు కన్నబాబుకు చెక్ పెట్టారు. తమకు ప్రత్యామ్నాయం చూపి న్యాయం చేయాలని వీళ్లు డిమాండ్ చేస్తున్న తరుణంలో గుంటూరులో జరిగిన పార్టీ శిక్షణా తరగతులకు అసలు వీరికి ఆహ్వానమే లేకపోవడం చర్చనీయాంశమైంది.

# ఏసిబి వలలో ఆర్టీవో!



ఒంగోలు రవాణాశాఖాధికారి, ఇన్‌ఛార్జ్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రాంప్రసాద్ ఇంటిపై ఇటీవల ఏసిబి దాడులు నిర్వహించి ఆదాయానికి మించిన ఆస్తులను గుర్తించింది. ఒకేసారి ఒంగోలుతో పాటు నెల్లూరు, వినుకొండ, విజయవాడ, బెంగుళూరులలో ఏసిబి అధికారులు దాడులు చేసారు. రాంప్రసాద్‌కు సంబంధించి నెల్లూరు వనంతోపులో వుంటున్న ఆయన బావమరిది, ఆర్టీవో కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న వరకుమార్ ఇంటిలో కూడా ఏసిబి అధికారులు సోదా చేశారు. అలాగే రాంప్రసాద్ స్నేహితుడు సత్యనారాయణ మూర్తి ఇంటిలోనూ, ఆర్టీవో ఆఫీసు సెక్యూరిటీ గార్డ్ రాపూరు శ్రీనివాసులు ఇంట్లోనూ సోదాలు నిర్వహించారు. ఈ దాడుల్లో కోట్లాది రూపాయల ఆస్తులు బయటపడ్డాయి. రాంప్రసాద్ 2009 నుండి 2014 వరకు నెల్లూరు ఆర్టీవోగా పని చేశారు. గతంలో ఏసిబికి పట్టుబడ్డ రవాణాశాఖాధికారులు ఆదిమూలం మోహన్, సుధాకర్‌రెడ్డిలు నెల్లూరులోనే పనిచేసి వెళ్లడం గమనార్హం. ఇప్పుడు రాంప్రసాద్ కూడా నెల్లూరులో పనిచేసే ఒంగోలు వెళ్లి వుండడం విశేషం.

# పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

## - రాపూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమావేశం



రాపూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులంతా సమావేశమై తమ పూర్వపు ఆత్మీయ జ్ఞాపకాలను మననం చేసుకున్నారు. ఎప్పుడో 47 ఏళ్ళ కిందట వదిలివెళ్ళిన ఆ పాఠశాలలో అదే తరగతి గదిలో మళ్ళీ వారంతా ఒకసారి కలవడంతో పాఠశాలలో సందడి నెలకొంది. 1968-69 సంవత్సరాల మధ్య 10వ తరగతి (ఎస్ఎస్‌సి) తొలి బ్యాచ్ చదువుకున్న విద్యార్థినీ విద్యార్థులు దాదాపు 35 మంది ఈ నెల 7వ తేదిన తాము చదువుకున్న పాఠశాలలో, చదువుకున్న తరగతి గదిలోనే ఆత్మీయ సమావేశం ఏర్పాటుచేసుకున్నారు. ఆనాడు వారికి చదువు చెప్పిన గురువులైన తోట గురుస్వామి శెట్టి, సాబ్జాన్‌లను ముఖ్య అతిథులుగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆ గురువులకు పాదాభివందనం చేసి ఘనంగా సత్కరించారు. అప్పట్లో పాఠశాలలో చదువుకున్న సుమారు 53 మందిలో 35 మంది ఇప్పుడు ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేసి రిటైరైనప్పటికీ, ఎంతో ఉత్సాహంతో ఈ ఆత్మీయ సమావేశానికి అందరూ హాజరుకావడం విశేషం. నాటి విద్యార్థి దశలోని జ్ఞాపకాలను వారు మననం చేసుకుని ఆనందించారు. ఆనాటి సిపిఎల్ శ్రీనివాసరావు (ఎస్వీ యూనివర్శిటీ రిటైర్డ్ ఉద్యోగి)హాజరై, అసెంబ్లీ జరిపి గురువులచేత పతాకావిష్కరణ గావించారు. అప్పట్లో ప్రార్థనాగీతాలు పాడేవారే ఇప్పుడు కూడా ఆ గీతాలను ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు. పూర్వ విద్యార్థులంతా ఆ తర్వాత దాదాపు అందరూ ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేసి రిటైరైన వారే కావడం మరో విశేషం. ఈ సమావేశానికి ప్రభుదాస్ (ఎల్ఐసి రిటైర్డ్ ఉద్యోగి) అధ్యక్షునిగా వ్యవహరించారు. కార్యనిర్వాహకులుగా కళ్యాణం రాజగోపాల్ (ఆంధ్రాబ్యాంక్ రిటైర్ట్ మేనేజర్), ప్రముఖ బాలసాహితీవేత్త డా. గంగిశెట్టి శివకుమార్, రేవూరి శ్రీనివాసరావు (రిటైర్డ్ ఆర్టీసి ఎస్ఐ), పెంచలనరసయ్య (తెలుగుగంగ రిటైర్డ్ ఉద్యోగి) తిరుపాల్‌రెడ్డి (ఎల్ఐసి రిటైర్డ్ ఉద్యోగి), సన్యాసయ్య (రిటైర్డ్ హాస్టల్ వార్డెన్), దేవదానం (ఫాస్టర్) వ్యవహరించారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# స్వచ్ఛభారత్‌కు పాతర!

**ప్రధాని నరేంద్రమోడీ ఎంతో ఉన్నతాశయంతో ఏర్పాటు చేసిన కార్యక్రమం స్వచ్ఛభారత్. చాలావరకు ప్రజల్లో చైతన్యం తెచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన సూత్రధారి, కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు మన నెల్లూరోడే! రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించే మున్సిపల్ మంత్రి నారాయణ మన నెల్లూరోడే! స్వచ్ఛభారత్ బ్రాండ్ అంబాసిడర్ ఎస్.పి.బాల సుబ్రహ్మణ్యం మన నెల్లూరీయుడే! ఇంతమంది స్వచ్ఛ నాయకులు, గాయకులున్నా నెల్లూరును మాత్రం స్వచ్ఛంగా ఉంచడంలో విఫలమవుతున్నారు. ఇందులో ప్రధాన బాధ్యతారాహిత్యం నెల్లూరు నగర పాలక సంస్థదే!**

నగరపాలకులకు దండు కోవడం, పిండుకోవడంపై ఉన్న శ్రద్ధాశక్తులు నెల్లూరును క్లీన్‌గా ఉంచడంలో లేకుండా పోయింది. అడ్డమైన పనులను అజెండాలలో పెట్టి, స్టాండింగ్ కమిటి సమావేశాలలో ఆమోదించేసుకుంటున్నారేగాని, నగరాన్ని స్వచ్ఛంగా ఉంచడంపై ఏ మాత్రం ఆలోచన చేయడం లేదు. ఏ మాత్రం ఉపయోగం లేని, ఎంత మాత్రం అక్కరలేని డివైడర్ల బ్యూటిఫికేషన్ పేరుతో కోట్ల రూపాయల దోపిడీకి శ్రీకారం చుట్టారు. మంచినీళ్లు, ట్యాంకర్లు, చెత్త ట్రాక్టర్ల పేరుతో లక్షల రూపాయలు కొల్లగొడుతున్నారు.

ప్రతి కాలనీలో చెత్త వేయడానికి తగినన్ని డంపర్‌బిన్‌లు లేవు. ఒక కాలనీ వారు డంపర్‌బిన్ అడిగితే ఇంకో కాలనీలో వున్నవి తీసుకెళ్లి అక్కడ పెడుతున్నారు. ఈ కాలనీ వాళ్లు అడిగినప్పుడు ఇంకెక్కడో ఉన్నది తెచ్చి ఈ కాలనీలో పెడుతున్నారు. అంతేగాని ప్రతి కాలనీకి, ప్రతి వీధికి కనీసం ఒక డంపర్‌బిన్‌నన్నా ఏర్పాటు చేయాలన్న ఆలోచన నగరపాలకులకు లేకుండా పోయింది. డివైడర్ బ్యూటిఫికేషన్‌కు పెట్టిన బడ్జెట్‌కు నెల్లూరు నిండా డంపర్‌బిన్‌లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి మురికి కాలువలో సిల్టు తీయొచ్చు. నగరం నిండా మందలు మందలుగా వున్న పందులను పట్టి ఉండొచ్చు. నగరంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి ఉండొచ్చు. కాని ఇవేమీ మనవాళ్లకు పట్టవు. మాటల్లో తప్పితే నెల్లూరును స్వచ్ఛంగా ఉంచడంపై ఆచరణాత్మక ఆలోచనే వీరికి లేదు.

### పక్క నగరాలపై ఉన్న ప్రేమ

# సొంత నగరంపై లేదేం!

## - మంత్రిపై కోటంరెడ్డి ఫైర్



మున్సిపల్ మంత్రి పి.నారాయణకు గుంటూరు, విజయవాడ నగరాల మీద ఉన్న ప్రేమ సొంత నగరమైన నెల్లూరుపై లేకుండా పోయిందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విమర్శించాడు. ఈ నెల 10వ తేదీన నెల్లూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుంటూరు, విజయవాడలకు వెయ్యి కోట్లను ఉచితంగా ఇచ్చిన మంత్రి నారాయణ తన ఉన్నతికి కారణమైన నెల్లూరు నగరంపై మాత్రం 1200కోట్లు అప్పు మూటను వేయడం దారుణమన్నారు. ఈ నిధులను అప్పు రూపంలో ఇచ్చి పన్నుల రూపంలో ప్రజలను బాదడం ఎంతవరకు సబబని ప్రశ్నించాడు. ఈ అప్పుకు వడ్డీ కూడా కట్టలేని పరిస్థితిలో నెల్లూరు నగర పాలక సంస్థ ఉందని, ప్రజలు ఈ భారాన్ని భరాయించే స్థితిలో లేరన్నారు. ఈ అప్పును గ్రాంటుగా మార్చి మంత్రి ఉత్తర్వులు జారీ చేస్తే నా గురువుగా మీకు పాతాభివందనం చేస్తానని కోటంరెడ్డి అన్నారు. పనిలో పనిగా మేయర్ అజీజ్‌ను కూడా సత్కరిస్తానన్నారు. ఈ అప్పుల పేరుతో ప్రజలపై పన్నుల రూపంలో ఎటువంటి భారం మోపినా ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించాడు. ఈ సమావేశంలో వైకాపా నగర అధ్యక్షులు తాటి వెంకటేశ్వర్లు, సునీల్ పాల్గొన్నారు.




# తిరిగి వారికే!

## వామపక్ష ఎమ్మెల్సీ అభ్యర్థులుగా

## విఠపు బాలసుబ్రహ్మణ్యం, యండపల్లి శ్రీనివాసులురెడ్డి

వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నెల్లూరు, ప్రకాశం, చిత్తూరుజిల్లాల ఉపాధ్యాయ పట్టభద్రుల నియోజకవర్గాలకు సీపీఎం పార్టీ ఇప్పుడున్న ఎమ్మెల్సీలనే అభ్యర్థులుగా ప్రకటించింది. ఉపాధ్యాయ నియోజక వర్గానికి ప్రస్తుత ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రహ్మణ్యంను, పట్టభద్రుల నియోజక వర్గానికి ప్రస్తుత ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డిని అభ్యర్థులుగా నిర్ణయించారు.

విఠపు బాలసుబ్రహ్మణ్యం వరుసగా రెండోసారి ఎమ్మెల్సీ అయ్యారు. మొదట పట్టభద్రుల నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆయన, రెండోసారి ఉపాధ్యాయుల నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. వచ్చే ఎన్నికల్లో గెలిస్తే హ్యాట్రిక్ అవుతుంది. ఇక యండపల్లి శ్రీనివాసులురెడ్డి వరుసగా రెండోసారి అభ్యర్థిత్వం దక్కించుకున్నట్లయ్యింది. సీపీఎం అనుబంధ సంస్థ యూటిఎఫ్ ఈ మూడుజిల్లాల్లో బలంగా ఉండడంతో ఈ రెండు నియోజకవర్గాల్లోనూ వామపక్ష అభ్యర్థులు సులభంగా నెగ్గుకొస్తున్నారు.

# పేద విశ్వబ్రాహ్మణులకు 'విద్యానిధి' చేయూత

ఈ నెల 9న నెల్లూరులోని 'శ్రీ సారంపాటి వీరన్నాచారి విశ్వబ్రాహ్మణ విద్యానిధి' సంస్థ కార్యదర్శి పి.దయానంద స్వగృహంలో జరిగిన పాలకవర్గ సమావేశంలో 2016-17 విద్యాసంవత్సరంలో జిల్లాలో చదువుతున్న పేద విశ్వబ్రాహ్మణ విద్యార్థిని, విద్యార్థులు 89 మందికి ఉచిత విద్యార్థి వేతనంగా మంజూరు చేశారు. ఇంజనీరింగ్ చదువుకుంటున్న 13 మంది విద్యార్థులకు వెయ్యి రూపాయల వంతున దాతలు పి.విమల, సుగుణ, దయానంద, వివేకానంద, కె.రామసుబ్బమ్మ, శ్రీధరణి-శ్రీధర్, పి.హర్ష-ఉమ, వై. శ్రీనివాసాచారి, వి.కమలాకర్‌లు విరాళంగా అందజేశారు. ఇనుకొండ చక్రపాణి తాత్కాలిక అధ్యక్షత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యానిధి కార్యవర్గసభ్యులు డి.నాగార్జునాచారి, వై.శ్రీనివాసాచారి, వై.నారాయణరావు, టి.కొండాచారి, పి.దయానంద, ప్రత్యేక ఆహ్వానితులుగా కొండా శేఖరరెడ్డి పాల్గొన్నారు.



## గూడూరు డివిజన్ వార్తలు

# 'అలనాటి పద్యాలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గంగిశెట్టి శివకుమార్

గూడూరు విశ్రాంత ఉద్యోగ భవనంలో గూడూరుకు చెందిన రచయిత చిన్న సిద్ధయ్య రచించిన 'అలనాటి పద్యాలు' అనే పుస్తకాన్ని ఆదివారం రచయిత గంగిశెట్టి శివకుమార్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తెలుగుభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నేటి యువతలో తెలుగుపై మక్కువ తగ్గుతుందన్నారు. తెలుగు భాషను పరిరక్షించుకునేందుకు సరళమైన భాషలో నేటి తరానికి అర్థమయ్యేలా అలనాటి పద్యాలు అన్న పుస్తకాన్ని ప్రచురించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సూపరింటెండెంట్ రమణయ్య, టీవీఎల్ ప్రసాద్, జానకిరామిరెడ్డి, రచయిత చిన్న సిద్ధయ్య, పోస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




జాతీయ పోలీస్ మెడల్‌ను సాధించిన గూడూరు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్‌ను ఈ నెల 11న గూడూరు రోటరీ క్లబ్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్, రోటరీ సభ్యులు డాక్టర్ సిఆర్‌రెడ్డి, బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, నాగసూరి గోపాలరావు, కె.మునిగిరీష్, హరిప్రసాద్, దశరథరామిరెడ్డి, నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా మొదలయ్యాయి...

# ఉత్కంఠ భరితంగా ముగిసాయి

## రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ విజేతలుగా విశాఖపట్నం, కృష్ణా జిల్లాలు

గూడూరు పట్టణంలో నాలుగురోజుల పాటు జరిగిన 3వ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళ, పురుషుల వాలీబాల్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిసాయి. మహిళల విభాగంలో కృష్ణా జట్టు ప్రథమ స్థానం, వెస్ట్‌గోదావరి రెండోస్థానం, వైజాగ్ మూడో స్థానం, కర్నూలు నాలుగోస్థానం కైవసం చేసుకున్నాయి. పురుషుల విభాగంలో వైజాగ్ జట్టు ప్రథమస్థానం, కృష్ణా జిల్లా జట్టు రెండోస్థానం, ప్రకాశం మూడో స్థానం, నెల్లూరు జట్టు నాలుగోస్థానం కైవసం చేసుకున్నాయి. అన్ని జట్ల మధ్య నువ్వా-నేనా అన్నట్లుగా వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ క్రీడల ద్వారా వ్యక్తిగత ప్రతిష్ఠతో పాటుగా ఉన్నత స్థాయికి ఎదిగేందుకు దోహదపడుతాయని అన్నారు. గూడూరు పట్టణంలోని జిల్లా వాలీబాల్ అసోసియేషన్, దాత కనుమూరి హరి చంద్రారెడ్డి సహకారంతో అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఈ నెల 6 నుంచి జరిగిన 3వ రాష్ట్ర సీనియర్ వాలీబాల్ మహిళల, పురుషుల పోటీలు అనంతరం బహుమతి ప్రధానోత్సవంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర వాలీబాల్ అధ్యక్షుడు రామయ్య, రాష్ట్ర కార్యదర్శి ద్రోణాచార్య అర్జున్, కనుమూరు హరి చంద్రారెడ్డి, అవార్డు గ్రహీత ఎ.రమణ రావు, ప్రముఖ పారిశ్రామికవేత్త, ప్రముఖ దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ పి.ఆర్.మోహన్, జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు కమలాకర్‌రెడ్డి, బి.శ్రీనివాసులు రెడ్డి, ప్రముఖ వర్ధమాన నటి సురభి, కె.మునిగిరీష్, తానంకి నానాజీ, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.



ప్రథమ బహుమతి సాధించిన కృష్ణా జట్టు

### వెస్ట్ రోటరీ, నెల్‌క్యాస్ట్ ఆధ్వర్యంలో

# గర్భిణులకు పౌష్టికాహారం



గూడూరు వెస్ట్ రోటరీ క్లబ్, నెల్‌క్యాస్ట్ పరిశ్రమల ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ క్రింద సోమవారం గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. రోటరీ అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయిలో వసతులు కల్పించడంతో మెరుగైన వైద్యం అందుతుందన్నారు. రోటరీ ప్రతినిధులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంఠ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్లు, నాసిన నాగులు, ఎన్.ఎస్.రెడ్డి, దువ్వూరు రవీంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ చంద్రబోస్, చెంచురెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జి.ఎస్.టి చట్టం : ఒక పరిశీలన






చిన్ని శ్రావణ్‌కుమార్
ఛార్టర్డ్ అకౌంటెంట్

వివిధ రకాల పన్నులకు స్వస్తి చెప్పి వినియోగదారులందరూ ఒక్కటే అనే విధంగా 'వస్తు సేవా' పన్నుని మన ప్రభుత్వం ఏప్రెల్ 1, 2017 నుంచి తీసుకురావడానికి పక్కా ప్రణాళికతో సిద్ధమవుతోంది.

ఈ వస్తు సేవా పన్ను బిల్లు వల్ల వస్తువుల రేట్లు తగ్గడమే కాకుండా ఎన్నో రకాల పన్నుల నుంచి విముక్తి కల్గి ఏకీకృత పన్నుల విధానం అమల్లోకి వస్తుంది.

**ఉదా:** ఇప్పటివరకు ఒక వస్తువు తయారీపై ఎక్సైజ్ సుంకం విధించేవారు. వస్తువు తయారై అమ్మకం జరగ్గానే 'వ్యాట్' విధించేవారు. అమ్మిన తర్వాత ఆ వస్తువుల్ని తీసుకెళ్ళే క్యారియర్‌కు 'సేవా పన్ను'ను విధించేవారు.

ఇన్‌పుట్ టాక్స్ (జమపడిన పన్ను) ఒక పన్నుకు మరొక పన్నుకు పొంతన వుండదు. ఒకవేళ పన్ను జమపడకపోతే వస్తువు ధర పెరుగుతుంది. వస్తు సేవా పన్ను (జిఎస్‌టి) ద్వారా వివిధ సుంకాల మధ్య జమపడే అవరోధాన్ని అధిగమించవచ్చు. వస్తు సేవా పన్నుల ద్వారా ఎక్సైజ్ సుంకం అదనపు మరియు ప్రత్యేక కస్టమ్స్ సుంకం, సేవా పన్ను, వస్తు ఆధారిత పన్ను, ఎంట్రీ టాక్స్, సెంట్రల్ సేల్స్ టాక్స్ మొదలగు చట్టాలకు చరమగీతం పాడడం జరుగుతుంది. వీటిస్థానే 'వస్తు సేవా పన్నుల చట్టం' అమల్లోకి రానున్నది. దీన్ని 'వినియోగ ఆధారిత చట్టంగా' పరిగణించవచ్చు.

వస్తు సేవా పన్నుల చట్టాన్ని మూడు రకాలుగా విభజించడం జరిగింది. ఎస్‌జిఎస్‌టి, సిజిఎస్‌టి, ఐజిఎస్‌టిలుగా విభజించబడ్డాయి.

ఎస్‌జిఎస్‌టి, సిజిఎస్‌టి రాష్ట్ర పరిధిలోని ప్రతి లావాదేవీకి వర్తిస్తాయి. ఐజిఎస్‌టి మాత్రం రాష్ట్ర సరిహద్దు దాటి ఏ లావాదేవీ జరిగినా వర్తిస్తుంది.

ప్రతి చట్టం వ్యాపార సంస్థ రిజిస్ట్రేషన్ ద్వారా ప్రారంభమైనట్లే వస్తు సేవా పన్నుల చట్టం కూడా రిజిస్ట్రేషన్ ద్వారానే ప్రారంభమవుతుంది. ఈ చట్టం క్రింద ప్రతి వ్యాపారి రెండు రిజిస్ట్రేషన్లు పొందవలసి వుంటుంది. రాష్ట్ర పరిధిలో ఎస్‌జిఎస్‌టి మరియు కేంద్రం పరిధిలో సిజిఎస్‌టి క్రింద రిజిస్ట్రేషన్ చేయవలసివస్తుంది. ఏ ఒక్క అధికారి రిజిస్ట్రేషన్ ఇవ్వకున్నా క్యాన్సిల్ అవుతుంది. రిజిస్ట్రేషన్ కోసం దాఖలు చేసిన తర్వాత మూడురోజుల్లో రిజిస్ట్రేషన్ ఇవ్వనియెడల అది రిజిస్ట్రేషన్ అయినట్లుగానే భావించవచ్చు (డీమ్డ్ రిజిస్ట్రేషన్).

వస్తు సేవా పన్ను విధానంలో జమపడే పన్ను (ఇన్‌పుట్ టాక్స్) మూడు విధాలుగా వుంటుంది.

| ఏ రకమైన టాక్స్ | ఇన్‌పుట్‌టాక్స్ క్రెడిట్ |
|---|---|
| ఎస్‌జిఎస్‌టి | ఎస్‌జిఎస్‌టి, ఐజిఎస్‌టి |
| సిజిఎస్‌టి | సిజిఎస్‌టి, ఐజిఎస్‌టి |
| ఐజిఎస్‌టి | ఐజిఎస్‌టి, సిజిఎస్‌టి, ఎస్‌జిఎస్‌టి |

ఉదా : 1. వస్తు సేవల్లో నెల్లూరు నుండి గుంటూరుకు వర్తకం జరిగితే, ఇది ఒకే రాష్ట్రానికి సంబంధించి జరిగింది కాబట్టి సిజిఎస్‌టి మరియు ఎస్‌జిఎస్‌టి వర్తిస్తుంది. ఎస్‌జిఎస్‌టి రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్తుంది. సిజిఎస్‌టి కేంద్ర ప్రభుత్వానికి వెళ్తుంది.

నెల్లూరు నుండి గుంటూరుకు అమ్మిన సరుకుల విలువ 1000 రూపాయలు అనుకుంటే, ఎస్‌జిఎస్‌టి 8శాతం అయితే, 80రూపాయలు అవుతుంది. సిజిఎస్‌టి 8శాతం అయితే 80రూపాయలు అవుతుంది. మొత్తం రూ.160 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించవలసి ఉంటుంది. అదే సరుకు గుంటూరు నుండి వైజాగ్‌కు రూ.2,000/-కు అమ్మితే ఎస్‌జిఎస్‌టి 8శాతం అయితే రూ.160-రూ.80 (నెల్లూరు నుండి గుంటూరుకు అమ్మినప్పుడు కట్టిన పన్నుని ఇన్‌పుట్ క్రెడిట్ క్రింద వినియోగిస్తే) = రూ.80/- ఎస్‌జిఎస్‌టి క్రింద చెల్లించవలసి ఉంటుంది.

సిజిఎస్‌టి 8శాతం అయితే రూ.160 - రూ.80 (నెల్లూరు - గుంటూరుకు అమ్మినప్పుడు కట్టిన పన్నుని ఇన్‌పుట్ క్రెడిట్ క్రింద వినియోగిస్తే) = రూ.80/- సిజిఎస్‌టి క్రింద చెల్లించవలసి ఉంటుంది.

**ఉదా: 2.** నెల్లూరు నుంచి గుంటూరుకు వస్తువుల విలువ 1000 రూపాయలు అనుకుంటే ఎస్‌జిఎస్‌టి 8 శాతం అయితే రూ.80/- అవుతుంది. సిజిఎస్‌టి 8 శాతం అయితే రూ.80/- అవుతుంది. మొత్తం రూ.160/- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జిఎస్‌టి క్రింద చెల్లించవలసి వుంటుంది. అదే సరుకులు గుంటూరు నుండి ముంబైకి(వేరే రాష్ట్రం) రూ.2,000/- అమ్మితే, ఐజిఎస్‌టి 16శాతం అయితే రూ.320/- కట్టవలసి ఉంటుంది. దీనికి ఇన్‌పుట్ టాక్స్ కనుక తీసుకుంటే రూ.320 - రూ.80 (సిజిఎస్‌టి) - రూ.80(ఎస్‌జిఎస్‌టి) = కేవలం రూ.160 మాత్రమే కేంద్ర ప్రభుత్వానికి చెల్లించవలసి ఉంటుంది.

**ఉదా : 3.** నెల్లూరు నుండి ముంబైకి అమ్మిన వస్తువుల విలువ రూ.1000/- అనుకుంటే ఐజిఎస్‌టి 16% అయితే 160 రూపాయలు కేంద్ర ప్రభుత్వానికి చెల్లించవలసి ఉంటుంది. తిరిగి ముంబై నుండి పూణెకు 2,000రూపాయలకి అమ్మితే ఎస్‌జిఎస్‌టి 8శాతం అయితే రూ.160/-, సిజిఎస్‌టి 8శాతం అయితే రూ.160/- మొత్తం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించవలసి ఉంటుంది. అయితే ఐజిఎస్‌టి ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ తీసుకోవడం వలన సిజిఎస్‌టి = రూ.160 - రూ.160(ఐజిఎస్‌టి) = రూ.0. ఎస్‌జిఎస్‌టి = రూ.160/-. కేవలం ఎస్‌జిఎస్‌టి రూ.160/- మాత్రమే చెల్లించవలసి ఉంటుంది.

ఇన్‌పుట్ లేని పరిమిత టర్నోవర్‌ను కాంపోజిషన్ స్కీమ్ క్రింద నిర్వచింపబడినది. దీనిని నిర్ధారించిన రేటు ప్రకారం చెల్లించాల్సి వుంటుంది. ఇకపై వస్తు సేవా పన్ను విధానంలో ప్రతి నెలా రెండు రిటర్న్‌లు సమర్పించవలసివుంటుంది. ఒకటి రాష్ట్ర ప్రభుత్వానికైతే మరొకటి కేంద్ర ప్రభుత్వానికి. అంతేకాకుండా అన్ని వివరములతో సంవత్సరాంతమున మరో రిటర్న్ ఫైల్‌చేయాల్సి వస్తుంది.

వస్తు సేవా పన్నుల్లో నాలుగు రకాల రేట్లను నిర్ధారిస్తారు. టెక్నాలజీకి పెద్దపీట వేసే జిఎస్‌టిలో పన్ను చెల్లింపు ఆన్‌లైన్ ద్వారానే వుండడం విశేషం. ప్రభుత్వాలు పన్ను కట్టించుకోవడమే కాక తిరిగి చెల్లించాల్సివస్తే (రిఫండ్ ఇవ్వాల్సివస్తే) 90 రోజుల్లో చెల్లిస్తారు.

ఏ పన్నుల చట్టంలో అయినా అసెస్‌మెంట్ అన్నది తప్పనిసరి అవుతుంది. సంవత్సరాల తరబడి కాకుండా అసెస్‌మెంట్ మూడు నెలల నుంచి ఆరు నెలల లోపల ముగించాల్సివుంటుంది. ఈ ఆడిట్‌ను ఆఫీసుల్లో కాకుండా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే స్థలంలో కూడా చేసేవిధంగా రూపొందించబడింది. న్యాయ నిర్ణయాన్ని సంవత్సరాంతాన రిటర్న్ ఫైల్ చేసిన 3 సంవత్సరముల లోపల తీర్పు ఇవ్వాల్సివుంటుంది. పన్ను కట్టే ప్రతి వ్యక్తి విచారణ జరిగే ఏ సమయంలోనైనా న్యాయ నిర్ణయాన్ని కోరవచ్చు.

అడ్వాన్స్ రూలింగ్స్ మరియు సెటిల్‌మెంట్ కమిషన్ ద్వారా ప్రత్యామ్నాయ తగాదాల పరిష్కారానికి జిఎస్‌టి దారిచూపడం మరింత విశేషం.

శ్రీను గల్పిక

# నెల్లూరు దోమలపై దండయాత్ర

## బాబు బెటాలియన్ సర్జికల్ స్ట్రైక్స్ - 2

***జరిగిన కథ :*** ***చంద్రబాబు, తన మంత్రులు పారామిలిటరీ దుస్తుల్లో ఆర్మీ హెలికాప్టర్ ఎక్కి సర్జికల్ స్ట్రైక్‌కు బయలు దేరుతారు. తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు వారికి వీర తిలకం దిద్ది సాగనంపుతారు. తమ తండ్రి ఆధ్వర్యంలో జరిగే సర్జికల్ దాడులను లోకేష్ టీవీలో లైవ్ చూస్తుంటాడు. తన తండ్రి చంద్రబాబు పాక్ ఉగ్రవాదులను చించి ఆరేసే సీన్‌లను చూడాలని లోకేష్ టెన్షన్‌తో చూస్తుంటే... చంద్రబాబు బెటాలియన్ శ్రీకాకుళం జిల్లాలో ఓ మురికిగుంట వద్ద దిగి ఫాగింగ్ మిషన్‌లకు పని పెడుతుంది. వారు వదిలిన పొగకు దోమలు గుట్టలు గుట్టలుగా ఛస్తాయి. సర్జికల్ స్ట్రైక్ పేరుతో తమ తండ్రి దోమల మీద దండయాత్రకా వెళ్లిందని లోకేష్ ఆశ్చర్యపోతాడు.***

***ఆ తర్వాత...***

*శ్రీకాకుళం జిల్లాలో దోమలపై సర్జికల్ స్ట్రైక్ విజయవంతమవుతుంది. రెట్టించిన ఉత్సాహంతో చంద్రబాబు బెటాలియన్ విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా, కృష్ణా జిల్లాల్లో దోమలపై సర్జికల్ దాడులు జరుపుకుంటూ వస్తారు. దోమలనబడే ఉగ్రరాక్షసులను సమూలంగా మట్టుబెడతారు. చంద్రబాబు బెటాలియన్ సర్జికల్ స్ట్రైక్‌పై ఏబిసిడి ఛానెల్‌తో పాటు టీవీ 9+9=99, బిఎఫ్, ఏ6, డిఎం వంటి ఛానెల్స్ అన్నీ కూడా ప్రత్యేక కథనాలను ప్రసారం చేయసాగాయి. దోమలపై సర్జికల్ ఆపరేషన్స్ నిర్వహించడంతో చంద్రబాబు ప్రపంచ దేశాలకే ఆదర్శంగా నిలిచాడని ఆకాశానికెత్తేసాయి. ఏబిసిడి ఛానల్‌లో అయితే ఆ టీవీ అధినేత గ్యాస్ కృష్ణ 'మీ గుండెల్లో నా మాట' ప్రోగ్రామ్‌లో చంద్రబాబు బెటాలియన్ సర్జికల్ ఆపరేషన్స్‌పై మేధావులతో ప్రత్యేక చర్చా కార్యక్రమం పెట్టారు. ఈ చర్చలో భాగంగా గ్యాస్ కృష్ణ మాట్లాడుతూ... బోర్డర్‌లో పాక్ తీవ్రవాదులపై భారత సైన్యం నిర్వహించిన సర్జికల్ స్ట్రైక్స్ కంటే కూడా ఏపిలో దోమలపై చంద్రబాబు బెటాలియన్ నిర్వహించిన సర్జికల్ స్ట్రైక్స్ ఎంతో క్లిష్టమైనది, కష్టసాధ్యమైనది కూడా! ఈ ఆపరేషన్‌ను విజయవంతం చేయడం చంద్రబాబుకే సాధ్యపడింది. తీవ్రవాదులు కాలిస్తే మనిషి ప్రాణం ఒకేసారి పోతుంది. కాని దోమలు కరిస్తే మనిషి జీవితాంతం చికున్‌గున్యా, డెంగ్యూ వంటి వాటితో బ్రతుకుతూ ఛస్తుండాలి. అదీగాక ఉగ్రవాదులను కనిపెట్టడం సులభం. కాని దోమలను కనిపెట్టి చంపడం కష్టం... మీరు ఏమంటారని కొంటె కృష్ణ మేధావులను అడిగాడు. వారంతా కూడా ఆపరేషన్‌ను చంద్రబాబే చేయగలడు, కాబట్టి వచ్చే ఎన్నికల్లో కూడా ఆయనను ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటేనే ఈ దోమల నుండి మనల్ని మనం కాపాడుకోగలమని మేధావులు చెప్పారు. అలాగే ఆరోజు 'దోమలు నుండి ఈ రాష్ట్రాన్ని కాపాడే నాయకుడు చంద్రబాబేనని మీరు భావిస్తున్నారా?' అని అడిగిన ప్రస్నకు 98శాతం మంది 'అవును' అని చెప్పినట్లు కొంటె కృష్ణ వెల్లడించారు.*

*శ్రీకాకుళం నుండి కృష్ణా జిల్లా దాకా తమ జాతి నిర్మూలన జరుగుతుందని గుంటూరు, ప్రకాశం, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల దోమలకు తెలిసిపోయి, అవన్నీ కూడా భయంతో వణికిపోతూ తమను తాము కాపాడుకోవడానికి, తమ జాతిని నిర్వీర్యం కాకుండా చూసుకోవడానికి మార్గాన్ని ఆలోచించాయి. మనల్ని కాపాడగలిగేది ఒక్క నెల్లూరు ప్రాంతమే! చంద్రబాబు కాదు, ఆయనను పుట్టించిన బాబు వచ్చినా నెల్లూరులో ఆయన ఆటలు సాగవు అని భావించి, అన్ని జిల్లాల దోమలు కూడా నెల్లూరు చేరి తమ నాయకుడైన డెంగ్యూకింగ్ కాలకేయను ఆశ్రయించాయి. ఈ నెల్లూరు మన అడ్డా... ఇక్కడ మనల్ని ఎవరూ, ఏమీ పీకలేరు. మీరు నిశ్చింతగా ఉండండంటూ డెంగ్యూ కింగ్ కాలకేయ వారికి అభయమిచ్చాడు.*

*చంద్రబాబు బెటాలియన్ గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో దోమలేవీ కనిపించకపోవడంతో నేరుగా నెల్లూరు చేరుకున్నారు. పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో వీళ్ల హెలికాప్టర్ దిగింది. అక్కడ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానందరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అజీజ్, కురుగొండ్ల రామకృష్ణ, బొల్లినేని రామారావు, బీద రవిచంద్ర, బీద మస్తాన్‌రావులు వీరికి స్వాగతం పలికారు. గ్రౌండ్ చుట్టూరా "ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలపై సర్జికల్ స్ట్రైక్‌కు విచ్చేసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వాగతం... సుస్వాగతం" అంటూ పెద్దఎత్తున ఫ్లెక్సీ కటౌట్‌లు ఏర్పాటు చేసివున్నారు. సర్జికల్ ఆపరేషన్స్‌తో అలసటగా ఉండటంతో చంద్రబాబు బృందం అక్కడే వున్న పోలీస్ గెస్ట్‌హౌస్‌లో ఓ అరగంట విశ్రాంతి తీసుకోవాలనుకుంది. అందరూ గెస్ట్‌హౌస్‌లోకి వెళ్లారు. చంద్రబాబు నెల్లూరు సిటీ మ్యాప్ తెమ్మని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును ఆదేశించాడు. ఆయన వెంటనే మ్యాప్ తెచ్చి చంద్రబాబు ముందు పెట్టాడు. చంద్రబాబు దానిని ఓపెన్ చేసి మనం ఎక్కడెక్కడ సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించాలో మ్యాప్‌లో గుర్తుపెట్టండి... అని జిల్లా కలెక్టర్ ముత్యాలరాజును అడిగాడు. వెంటనే కలెక్టర్ నగరంలో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా చెప్పుకునే కొన్ని ఏరియాలను మార్క్ చేశాడు. ఫాగింగ్ మిషన్‌లలో మందును లోడ్‌చేసే పనిని మేయర్ అజీజ్‌కు అప్పగించాడు. ఈ తతంగాన్నంతా మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి పక్కనే వుండి గమనిస్తున్నాడు. చంద్రబాబు బెటాలియన్ టిఫిన్ కానిచ్చి వెంటనే యూనిఫాం ధరించింది. ఫాగింగ్ మిషన్‌లను చేతపట్టారు. ముందు మన్సూర్‌నగర్ వద్ద గుర్తించిన అతిపెద్ద ముదురుదోమల ఉత్పత్తి కేంద్రం వద్ద సర్జికల్ స్ట్రైక్ నిర్వహించాలని, ఈ ఆపరేషన్‌కు అవసరమైతే స్థానిక శానిటేషన్ సిబ్బంది సహకారం కూడా తీసుకోవాలని అప్పటికప్పుడు నిర్ణయించారు. ఎందుకైనా మంచిదనిచెప్పి ముందు జాగ్రత్తగా ఈ సర్జికల్ స్ట్రైక్‌లో దోమల చేతిలో తాము గాయపడితే ఆసుపత్రికి తరలించడానికి వీలుగా పెద్దాసుపత్రి వద్ద అంబులెన్స్‌లు లేకపోవడంతో నారాయణ ఆసుపత్రి అంబులెన్స్‌లను తెప్పించారు. చంద్రబాబు బెటాలియన్ ఇక ఆపరేషన్ కోసం లేచి కదలబోతుండగా... అక్కడే వున్న ఆనం రామనారాయణరెడ్డి ఆవేశంతో... ఏం నారాయణ, మన చంద్రబాబు కంటే విషయం తెలియదు, మరి నీ బుద్ధేమైంది. నీ తెలివి ఎక్కడ తెల్లారింది? అని ప్రశ్నించాడు. ఆయన ప్రశ్నలతో అక్కడున్న వాళ్లంతా ఒక్కసారిగా నివ్వెరపోయారు!*

(ఇంకా వుంది...)

## రాశి - మీ వాసి



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

తేది. 14.10.2016 నుండి
తేది. 20.10.2016 వరకు

ఈ వారం సింహంలో రాహువు, కన్యలో రవి బుధ గురువులు, 17తేది నుండి తులలో రవి, వృశ్చికంలో శనిశుక్రులు, ధనుస్సులో కుజుడు, కుంభంలో కేతువు, మీన మేష వృషభ మిధున రాశులలో చంద్రుడు సంచరిస్తారు.


### మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆర్ధిక ఇబ్బందులు, వ్యవహారాల ఇబ్బందులుంటాయి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. సేవా కార్యక్రమాలు, సంస్థల సమావేశ పనులందు చురుకుగా పాల్గొంటారు. అనుకున్న పనులకు ఆటంకాలుంటాయి. ఇతరులను అతిగా నమ్మి బాధ్యతలు అప్పగించవద్దు. వ్యాపారవృద్ధికి ఆకర్షణీయంగా ప్రయత్నాలు జరుగుతాయి. ఆరోగ్యం జాగ్రత్త.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

దూరప్రాంత ప్రయాణాలుండి శ్రమ పడతారు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. ఆదాయం పెరుగుతుంది. చిన్న గాయాలు తగులుట, స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. సభలు సమావేశాలలో పాల్గొంటారు. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు దొరకడం, ప్రముఖుల పరిచయాలు బలపడటం జరుగుతుంది. కొత్త పెట్టుబడులకు అవకాశాలు లభిస్తాయి.

### మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆదాయానికి ధీటుగా అదనపు ఖర్చులుంటాయి. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతూ ఆదాయం పెరుగుతుంది. యజమానులకు వర్కర్లతో సమస్యలుండవచ్చును. ఆర్ధిక లావాదేవీలు, వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. తొందరపాటు నిర్ణయాలు చేయకుండా జాగ్రత్తపడండి. విద్యా ప్రగతి బాగుంటుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్తగా వ్యవహరించండి.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ధన లాభము, నూతన వస్తువులు సమకూరుట, వాహన సౌఖ్యం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉండి పెట్టుబడి అవకాశాలు లభిస్తాయి. ఉద్యోగులకు ఉన్నత పదవీ అవకాశాలు, అదనపు బాధ్యతలుంటాయి. బిడ్డల విద్యా వివాహ విషయాలపై శ్రద్ధ చూపుతారు. కుటుంబంలో స్వల్ప కలతలుండి సర్దుబాటు కాగలవు.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆర్ధిక ఇబ్బందులు తొలగి వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా సాగుతాయి. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతున్నా టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. దైవకార్యాలు, సేవా కార్యములలో పాల్గొంటారు. పనులను లౌక్యంగా జరుపుకొనాలి. కొత్త కాంట్రాక్టులు, నిర్మాణాలు చేపట్టుతారు. ఉద్యోగులకు స్థానమార్పులు, అనవసర ప్రయాణాలుంటాయి.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

చేపట్టిన పని విజయవంతంగా నిర్వహిస్తారు. వ్యాపారవృద్ధికి గల అవరోధాలు తొలగి ఆదాయం పెరుగుతుంది. వృత్తి జీవనంలో అవకాశాలు, రాబడి పెరుగుతుంది. మీరిచ్చే సలహాలు సూచనలకు కుటుంబంలో గాని, సమావేశాల్లో గాని ఆమోదం పొందుతారు. స్థిరాస్తుల లావాదేవీలు జరుగవచ్చును. కొత్త పెట్టుబడులకు, వ్యాపారాలకు ప్రోద్బలం లభిస్తుంది.

### పంచాంగము:

తేది 20 గురువారము ఉదయం గంట 3.54 నుండి గంట 5.57 వరకు కన్యా లగ్నమున గృహారంభ గృహప్రవేశ వివాహములు.

#### ఆశ్వయుజ మాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 14 | శుక్ర | త్రయోదశి | ప॥ గం.2.10వ॥ |
| తేది. 15 | శని | చతుర్దశి | ప॥ గం.12.10వ॥ |
| తేది. 16 | ఆది | పూర్ణిమ | ఉ॥ గం.10.14వ॥ |
| తేది. 17 | సోమ | పాడ్యమి | ఉ॥ గం.7.53వ॥ |
| | పిదప | విదియ | రా॥ గం.5.35వ॥ |
| తేది. 18 | మంగళ | తదియ | రా॥ గం.3.11వ॥ |
| తేది. 19 | బుధ | చతుర్థి | రా॥ గం.12.47వ॥ |
| తేది. 20 | గురు | పంచమి | రా॥ గం.10.34వ॥ |

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

తొందరపాటు ప్రవర్తన ఉంటుంది. ఆచితూచి నిర్ణయాలు చేయండి. ఆర్ధికంగా కొద్దిపాటి ఇబ్బందులుంటాయి. బంధువర్గంతో పేచీలు రావచ్చును. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. కాంట్రాక్టర్లు, హోల్‌సేల్ వ్యాపారదారులు ప్రభుత్వం నుండి సమస్యలు ఎదుర్కొనవలసి వస్తుంది. శుభకార్యాలలో పాల్గొంటారు. ఉద్యోగులకు పని వత్తిడి, స్థానమార్పులుండగలవు.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఇంటా బయట వ్యవహారాలను సమర్ధవంతంగా నిర్వ హిస్తారు. ప్రభుత్వ పరంగా అనుమతులలో జాప్యం, బిల్లులు నిలబడి పోవడం ఉంటుంది. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. అవసరాలకు డబ్బు అందుతుంది. బాంధవ్యాలు బలపడి, శుభకార్యాలు నిర్ణయం కాగలవు. స్థిరాస్తులపై ఆదాయముంటుంది. కోర్టు వ్యవహారాలలో అనుకూలత కలదు.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆదాయానికి తగినట్లుగా ఖర్చులు పెరుగుతాయి. అయినా పెద్ద ఇబ్బందులుండవు. కొత్త వ్యాపారాలకు, భాగస్వామ్య వ్యాపారములకు అవకాశాలు దొరుకుతాయి. ఉద్యోగులకు పనిభారం, అధికారుల ఆదరణ ఉంటుంది. శుభకార్య నిర్ణయాలు జరగకపోవచ్చును. కొందరు విమర్శిస్తారు, పట్టించుకోవద్దు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆర్ధిక ఒప్పందాలకు, కొత్త పెట్టుబడులకు అనుకూల సమయం. వృత్తి వ్యాపారాలు విస్తరించి, ఆదాయం పెరుగుతుంది. కొద్దిగా అదనపు ఖర్చులుండినా అవసరాలు జరిగిపోతాయి. ప్రముఖులను పెద్దలను కలుసుకుంటారు. ప్రభుత్వ అనుమతులందు స్వల్ప ఆటంకాలుండి తొలగిపోతాయి. శుభకార్యాలలో పాల్గొంటారు. విద్యా ప్రగతి బాగుంటుంది.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆదాయానికి ధీటుగా ఖర్చులుంటాయి. డబ్బు చేతిలో నిలవదు. వ్యాపార అభివృద్ధి అవకాశాలు చేజారిపోవచ్చును. నిర్మాణాది పనులు ప్రారంభించగలరు. పనులు నిదానంగా జరుగుతూ టెన్షన్ పెట్టగలవు. ఉద్యోగులకు పనిభారం, కొత్త సమస్యలుంటాయి. తొందరపడి హామీలు, సంతకాలు చేయవద్దు. వృత్తి జీవనం కలవారికి ఆశాజనకంగా ఉంటుంది.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వృత్తి వ్యాపారాలలో స్వల్ప లాభాలుంటాయి. వ్యాపార, ఆర్ధిక వ్యవహారాలు పేచీ పెడతాయి. అయిన వాళ్ల వల్ల సమస్యలుండవచ్చును. కాని సర్దుబాటు అవుతాయి. స్థిరమైన నిర్ణయాలుగైకొంటారు. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. ఉద్యోగార్ధులకు ప్రయత్నాలు అనుకూలించే సమయం. అనుకున్న పనులను పట్టుదలతో కొనసాగించండి. విద్యార్థులకు మంచి ప్రగతి ఉంటుంది.



### కన్నవాళ్లకు కన్నీళ్లు మిగిల్చి...

# కనుమరుగైపోయిన 'అఖిల్'

## • అమరలోకాలకు తరలిన ఆత్మబంధువు

*ఆ అమ్మకీ నాన్నకీ అన్నీ తమ బిడ్డే. వాళ్ళ గుండె చప్పుడూ, కంటి చూపు, పీల్చే శ్వాస అన్నీ తమ ముద్దుల తనయుడు అఖిలే! 22సంవత్సరాలుగా ఆ బిడ్డను అల్లారు ముద్దుగా పెంచుకున్నారు. తమ కలల యువరాజుగా తన వంశ రారాజుగా ఆ అబ్బాయిని పెద్దవాడిని చేశారు. అయితే విధి క్రూరమైంది. కాలం కసాయిది. అకస్మాత్తుగా తమ గారాల పట్టీని ఆ తల్లిదండ్రులకు దూరం చేసింది. కన్నతల్లికి కడుపు కోతని, తండ్రికి హృదయరోదనను మిగిల్చి వారి ముద్దుల కొడుకును మృత్యువు రూపంలో కబళించింది.*

హృదయ విదారకమైన ఈ సంఘటన బొమ్ము ప్రవీణ్ – భారతిల కుటుంబంలో జరిగింది. నెల్లూరుజిల్లా గూడూరుకు చెందిన బొమ్ము ప్రవీణ్ గత 2దశాబ్దాలకు పైగా హైదరాబాదులో స్థిరపడి మంచి వ్యాపారవేత్తగానే కాకుండా మానవతా హృదయం కలిగిన స్నేహశీలిగా ఎంతోమందికి ఆప్తుడిగా మారాడు. ఆయన శ్రీమతి భారతి కూడా భర్తకు తగ్గ ఇల్లాలు అనిపించుకుంది. వారిరువురి ఏకైక సంతానమే అఖిల్. హైదరాబాద్‌లో అత్యున్నత విద్యా సంస్థల్లో చదువుకున్నాడు అఖిల్. తల్లిదండ్రుల వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని తన మిత్రులకే కాకుండా తన తండ్రి స్నేహితులకు కూడా అన్నీ తానే అన్నట్లుగా దగ్గరయ్యాడు. ఎవరు ఏదడిగినా కాదనకుండా చేసే మనస్తత్వాన్ని అలవరచుకున్నాడు. సెప్టెంబర్ 2, 2016న 22 సంవత్సరాలు పూర్తి చేసుకుని 23వ పడిలో అడుగుపెట్టాడు. తన పుట్టినరోజంటే చిన్నప్పటి నుండీ అనాథాశ్రమంలోనే చేసుకోవడం అఖిల్‌కి ఆనవాయితీ. ప్రతి ఆరునెలలకీ రక్తదానం చేయడం అఖిల్‌కి ఇష్టం. తను చదివే కాలేజీలో 'రాఖీ' పండుగ అంటే అందరి అమ్మాయిల చేత రాఖీ కట్టించుకునే యూనివర్శల్ అన్నయ్య లేదా తమ్ముడు అఖిల్. అలాంటి బంగారుకొండని, ఆత్మబంధువుని మృత్యువు ప్రమాదం రూపంలో ఆవహించింది. అతి చిన్నవయస్సులో అందరు మనసులో దాచుకున్న అపురూప వ్యక్తిని దైవసన్నిధికి చేర్చింది. అక్టోబర్ 8వ తేదీ తన స్వంత ఇంటిలో మూడవ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తూ కాలు జారిన అఖిల్ 40అడుగుల పైనుండి క్రిందపడిపోయాడు. 24గంటల అనంతరం డాక్టర్లు "బ్రెయిన్ డెడ్" అని ధృవీకరించడంతో... అల్లాడిపోయిన తల్లిదండ్రుల రోదన వర్ణనాతీతం. విలవిలలాడిన వారి మనసులు మనోస్థైర్యాన్ని కోల్పోలేదు. తమ బిడ్డ ద్వారా మరికొంతమందికి జీవం పోయాలనుకున్నారు, అవయవ దానంతో తమ బిడ్డ ప్రాణానికి పునః ప్రతిష్ట చేశారు.

అఖిల్ ఆకస్మిక కనుమరుగుతో తీవ్ర శోకంతో రోదిస్తున్న అఖిల్ అమ్మానాన్నలకు, బాబాయిలు పిన్నిలకు, మామయ్యలు అత్తయ్యలకు, తాతయ్యలు బామ్మలకు, అన్నయ్యలు తమ్ముళ్ళకు, అక్కలు చెల్లెళ్ళకు, వీరందరితో పాటు అఖిల్‌ను ప్రాణప్రదంగా ప్రేమించే స్నేహితులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

# జయ జయహో... జగన్మాత

## • వాడవాడలా ముగిసిన శరన్నవరాత్రి మహోత్సవాలు

నెల్లూరుజిల్లాలో ఈ నెల 1వ తేదీ నుండి 11వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. దేవీ ఆలయాల్లో అమ్మవారికి విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారు విశేషాలంకారాలతో భక్తులకు దర్శనమిచ్చారు. నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో 42వ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు శ్రీ చండీ అలంకారంతో ప్రారంభమై, శ్రీ భవాని, శ్రీ గాయత్రి, శ్రీ అన్నపూర్ణ, శ్రీ గజలక్ష్మి, శ్రీ మహాలక్ష్మి, శ్రీ కాళిక, శ్రీ సరస్వతి, శ్రీ దుర్గా, శ్రీ మహిషాసుర మర్ధిని, శ్రీ రాజరాజేశ్వరి అలంకారాల్లో అమమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. 12వ తేదీ ఆల్తూరు ఆదినారాయణరెడ్డి, సులోచనమ్మ కుటుంబ సభ్యులచే అన్నదాన కార్యక్రమం జరిగింది. మహిళా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విశేషపూజలు, దీపారాధనలు, నోములు నోచుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు తంగిరాల రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రతిరోజు విశేషపూజలు నిర్వహించారు. ఆలయ సహాయకమిషనర్, కార్యనిర్వహణాధికారి పులి కోదండ రామిరెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరాంలు పర్యవేక్షించారు. ప్రతిరోజూ సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

**శ్రీ ఇరుకళలపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో...**

నెల్లూరు మూలాపేటలో వేంచేసి భక్తులచే తొలిపూజలందుకునే సింహపురి గ్రామ దేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 1 నుండి 11వ తేదీ వరకు వైభవంగా జరిగాయి. ఈ నెల 1వ తేదీ శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి అలంకారంతో ప్రారంభమై శ్రీ అన్నపూర్ణదేవి, శ్రీ గజలక్ష్మి, శ్రీ సరస్వతి, శ్రీ భవాని, శ్రీమహాలక్ష్మి, శ్రీ దుర్గా, శ్రీ చండి, శ్రీ లలితా పరమేశ్వరి, శ్రీ మహిషాసుర మర్ధిని, శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి అలంకారాలలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతిరోజు భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ప్రతిరోజు అభిషేకాలు, పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రమాలను ఆలయ అర్చకులు పులికొలను చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి యం.జానకి, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ మెట్టు సురేష్‌బాబులు పర్యవేక్షించారు.

**శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో...**

నెల్లూరు మూలాపేటలో వెలసియున్న శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 1 నుంచి 10వ తేదీ వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ ఆల్తూరు గిరీష్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. ప్రతిరోజు అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల సందర్భంగా నవావరణ పూజ, పుష్పాలంకరణ, చండీహోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

**శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో...**

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో వెలసియున్న శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 1 నుండి 12వ తేదీ వరకు ఆలయ ఛైర్మెన్ మునగా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మంచికంటి శ్రీనివాసులు, కోశాధికారి వాయుగుండ్ల సాయిసువర్ణ, ఆలయ కమిటీ మెంబర్ల ఆధ్వర్యంలో కనువిందుగా జరిగాయి. 11వ తేదీ విజయదశమి పర్వదినం సందర్భంగా పులి వాహనంపై అమ్మవారి నగరోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. నెల్లూరు నగరంలోని అన్ని మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానాల్లో శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు.










విజయదశమి పర్వదినం సందర్భంగా గూడూరు మాలవ్యానగర్‌లోని మహాలక్ష్మమ్మ దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న ప్రముఖ సీనియర్ న్యాయవాది, బ్రాహ్మణ సేవాసంఘ అధ్యక్షుడు వై.చలపతిరావు తదితరులు



# తమిళనాట నిలిచిన తెలుగుతేజం

## • పుట్టినరోజున సిఎంకె రెడ్డి సామాజిక సేవలు





అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు, తమిళనాట తెలుగుభాష పరిరక్షకుడు అయిన ప్రొఫెసర్ సి.ఎం.కె రెడ్డి జన్మదినోత్సవ వేడుకలు అక్టోబర్ 6న తమిళనాడులో ఎంతో ఘనంగా జరిగాయి. గత అయిదేళ్ళుగా ఆయన తన పుట్టిన రోజును 'మాతృభాష పరిరక్షణ దినం'గా పరిగణించి నిర్వహించు కోవడం ఆయనకు మాతృభాష పట్ల వున్న అపారమైన అభిమానానికి నిదర్శనం. ప్రతి పుట్టినరోజును తెలుగు భాషాభివృద్ధికి, తమిళనాడులో తెలుగు వెలుగులు నింపేందుకు, సామాజిక సేవకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం ఆయనకు ఆన వాయితీ. ఈసారి కూడా తన పుట్టిన రోజున తమిళనాడులోని పలు తెలుగు పాఠశాలల్లో విద్యార్థినీ విద్యార్థుల అభ్యున్నతిని కాంక్షిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల వృద్ధులకు దుప్పట్లు పంచారు. అన్నదానం చేశారు. తన పుట్టినరోజున తమిళనాడులోని విల్లివాక్కంలో వున్న శ్రీ కనకదుర్గ తెలుగు హయ్యర్‌స్కూల్‌లో యుఎస్‌కు చెందిన సిఎల్‌పిపిఎస్ అనే సంస్థ సహకారంతో విద్యార్థులకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని బోధించేందుకు అవసరమైన అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్‌ను సిఎంకె రెడ్డి తన చేతులమీదుగా ప్రారం భోత్సవం చేశారు. అదేవిధంగా, పెరంబూరులోని ఆర్‌బిసిసి హయ్యర్ సెకండరీ స్కూల్ విద్యార్థులకు అవసరమైన స్టేషనరీ సామగ్రిని అందజేశారు. సిఎంకెరెడ్డి చేస్తున్న సామాజిక సేవలో భాగంగా అదే రోజున వందమంది ఆది ఆంధ్ర తెగలకు చెందిన నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అంబత్తూరులో వృద్ధాశ్రమంలో జీవిస్తున్న అనేకమంది వయోవృద్ధులకు మంచి భోజనం పెట్టించారు. అన్నానగర్‌లో మానసిక వైకల్యంతో బాధపడుతున్న అనాథలకు అన్నం పెట్టారు. రెడ్‌హిల్స్ సమీపంలోని కవంగరైలో వృద్ధాశ్రమంలో వున్న వయోవృద్ధులకు దుప్పట్లు, భోజన ప్యాకెట్లు అందజేశారు. తన పుట్టినరోజున ఇలా పలు సామాజిక సేవలు నిర్వహించి అందరికీ ఆదర్శప్రాయులుగా నిలుస్తున్నారు సిఎంకె రెడ్డి. అటు మాతృభాష పరిరక్షణకు, ఇటు సామాజిక సేవకు ఎంతో ప్రాధాన్యత ఇస్తూ, మాతృభాషాభివృద్ధికి అంకితమై తమిళనాడులో అటు తెలుగు భాషాభ్యున్నతికి అలుపెరుగని సేవ చేస్తూ, మరోవైపు నిరుపేదలకు, వయోవృద్ధులకు తనవంతు సేవ చేస్తూ అందరికీ మార్గదర్శంగా వున్న మన సింహపురీయుడు, తమిళనాడులో తెలుగుతేజంగా నిలిచిన సిఎంకెరెడ్డికి...'లాయర్' జన్మదినోత్సవ శుభాకాంక్షలు.

# ప్రచారమే తప్ప... ప్రగతి ఏది?

(మొదటి పేజీ తరువాయి)

ఈ రాష్ట్రాన్ని పరిపాలించిన ఏ ముఖ్యమంత్రి గాని, ఈ దేశాన్ని పరిపాలించిన ప్రధాన మంత్రులుగాని ఎవరు కూడా అది నేను చేసాను, ఇది నేను చేసానని చెప్పుకున్న సందర్భాలు లేవు. వాళ్లు చెప్పుకోకపోయినా, వారు చేసిన మంచి పనుల గురించి ఈరోజుకీ మనం చెప్పుకుంటున్నాం. 2014లో సిఎం అయ్యింది మొదలు ప్రజలు నచ్చేలా, మెచ్చేలా చంద్రబాబు ఏం పనులు చేసాడు. ఆర్భాటంగా గోదావరి, కృష్ణ పుష్కరాలు నిర్వహించాడు. దాదాపు 4వేల కోట్లు వీటికి తగలేసాడు. పుష్కరాలను ప్రశాంతంగా నిర్వహించాల్సిందే! అయితే వీటి పేరుతో భారీ దుబారానే ఎవరూ హర్షించడం లేదు. పోలవరం పూర్తయితే ఉపయోగం కాని, పట్టిసీమ ప్రాజెక్ట్‌ను ఎందుకోసం చేపట్టారో అందరికీ తేలిసిందే! ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో ఆయన ఏ ఒక్కటీ సక్రమంగా నిర్వహించలేదు. ఋణమాఫీ వాగ్దానంతో అధికారంలోకి వచ్చిన ఆయన దానిని పరిపూర్ణంగా అమలు చేయలేదు. దీనిమీద రైతులు ఎంతగా మండిపడుతున్నారో వారి ముందుకు వెళితే తెలుస్తుంది. ఇక చంద్రబాబు ప్రధానంగా పెట్టుకున్న పని రాజధాని. మూడేళ్లుగా ఆ తంతు జరుగుతూనే వుంది. చంద్రబాబు చెబుతున్న సింగపూర్ రాజధానిని ఈ తరం వాళ్లు చూడలేకపోవచ్చు. ఆయనకు రాజధాని తప్ప రాష్ట్రం అన్నది ఒకటుందని, దానిని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్న ధ్యాసే లేనట్లుగా వుంది. సంక్రాంతి కానుకలు, రంజాన్ తోఫాలు, మజ్జిగా ప్యాకెట్లు... ఈ చిల్లరమల్లర పనులేనా... అద్భుతాలు! అన్నింటికి మించి రాష్ట్రానికి ప్రత్యేకహోదాను సాధించలేక పోవడం ఆయన నాయకత్వ వైఫల్యానికి నిదర్శనం. రాదు అనుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని ఆ ప్రాంత నాయకులు పోరాడి సాధించుకుంటే, కేంద్రం ఇస్తామన్న ప్రత్యేకహోదాను సాధించుకోలేక, వారిచ్చిన ప్యాకేజీని లొట్టలేసుకుంటూ తీసుకున్న అసమర్ధ నాయకత్వం మనది. ఈ రెండున్నరేళ్లలో రాష్ట్రం ఏ రంగంలోనైనా అభివృద్ధి చెందిందా? విదేశీ పెట్టుబడులొచ్చాయా? కొత్త పరిశ్రమలొచ్చాయా? రాష్ట్రంలో ఏ రంగం ప్రజలైనా సంతృప్తిగా సంతోషంగా వున్నారా? గత కాంగ్రెస్ ప్రభుత్వంలో వై.యస్ పెట్టిన పథకాలకు పేర్లు మార్చడం తప్పితే చంద్రబాబు తన ముద్ర పడేలా ఏవైనా మంచి కార్యక్రమాలు అమలు చేయగలిగాడా? ఇవేమీ చేయక పోయినా అప్పుడెప్పుడో కట్టిన శ్రీశైలం ప్రాజెక్ట్ నుండి నిన్న శ్రీహరికోట నుండి వదిలిన రాకెట్ వరకు అన్నీ నా వల్లే అన్నట్లున్న చంద్రబాబు తీరుకు ప్రజలు విస్తుపోతున్నారు.

# పచ్చ పైత్యాన్ని వదిలిస్తున్న... సోషల్ మీడియా!

(మొదటి పేజీ తరువాయి)

మీడియా దీనిపై నిలదీయలేదు. కానీ, ఈ సంగతులన్నీ ప్రజలకు చేరాల్సిన రూపంలో చేరుతూనే వున్నాయి. ఎల్లో మీడియా దాచాలనుకున్న నిజాలను ప్రజలకు చేరువ చేస్తున్న ఆ ప్రచార సాధనమే సోషల్ మీడియా! ఈరోజు సోషల్ మీడియాలో అనేక సైట్లు రాష్ట్ర ప్రభుత్వ విధానాలను, చర్యలను, దుబారాను తూర్పారబడుతున్నాయి. ముఖ్యంగా నెటిజన్లు అయితే వివిధ అంశాలపై స్పందిస్తున్న తీరు చాలా ఆశ్చర్యకరంగా వుంటుంది. వ్యంగ్య కార్టూన్‌లు, వ్యాఖ్యానాలతో నెటిజన్‌లను అలరించే విధంగా పోస్టింగ్‌లు పెడుతున్నారు. సోషల్ మీడియాలో కొన్ని మీడియా గ్రూపులు సైతం ప్రభుత్వం తీరును ఎండగడుతున్నాయి. అమరావతి రాజధానిని మొదలుకొని, కృష్ణా, గోదావరి పుష్కరాలు, పట్టిసీమ, ప్రత్యేకప్యాకేజీ, వేసవి మజ్జిగ ప్యాకెట్లు, పోలవరం ప్రాజెక్ట్ అంచనా పెంపు, వందల కోట్లతో రాజధాని తాత్కాలిక భవనాలు, హైదరాబాద్‌లో సెక్రటేరియట్ మరమ్మత్తులు, ఓటు–నోటు కేసు... వంటి అంశాలపై నెటిజన్లు తీవ్రంగా స్పందించారు.

తాజాగా గుంటూరులో జరిగిన పార్టీ శిక్షణా తరగతులలో పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేష్‌బాబు వేదికపై నిలబడి ఉపముఖ్యమంత్రి, హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్పను మందలిస్తున్నట్లుగా ఫోజిచ్చిన ఫోటో పెనుదుమారమే రేపింది. తెలుగుదేశంపార్టీ మీడియా విభాగమే ఈ ఫోటోను పోస్ట్ చేసింది. ఈ ఫోటోను చూసిన నెటిజన్‌లు తమ కామెంట్‌లతో లోకేష్‌ను ఆడుకున్నారు. ఈ ఫోటో దెబ్బకు చంద్రబాబుపై అంతంతమాత్రంగా వున్న కాపులు కూడా ఆగ్రహం చెందారు. ఈ ఫోటో మూలంగా పార్టీకి భారీగానే డామేజీ జరిగింది. జరగాల్సిన నష్టం జరిగిపోయాక పార్టీ శ్రేణులు దీనిని తొలగించాయి. ప్రధానపత్రికలు, ప్రధాన టీవీ ఛానెల్స్ అన్నీ తాము చెప్పినట్లే నడుచుకుంటున్నా, దారికి రాని ఛానెల్స్‌ను అదిరించి, బెదిరించి దారికి తెచ్చుకుంటున్నా, ఈ సోషల్ మీడియాను దారికి తెచ్చుకునే దారులు లేక తెలుగునేతలు తలలు బాదుకుంటున్నారు.



# ఏసి స్టేడియం వాకర్స్‌కు అవార్డు

గుంటూరు జోన్ పరిధిలో బెస్ట్ క్లబ్ అవార్డును విశిష్ట సేవలందించిన ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్‌కు అందజేసారని ఆ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వేలూరు రంగారావు, స్వర్ణ రమేష్‌బాబులు తెలిపారు. గుంటూరులో మంగళవారం జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్‌లో గుంటూరు జోన్ పరిధిలోని 70క్లబ్‌లలో బెస్ట్ క్లబ్‌గా ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ క్లబ్, బెస్ట్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధానకార్యదర్శులుగా తాము ఎన్నికైనట్లు తెలిపారు. ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎలక్ట్ చెలికాని సీతారామయ్య, డిస్ట్రిక్ట్ 203 గవర్నర్ శ్రీనివాసరెడ్డి, మాజీగవర్నర్ యం.వి.సుబ్బారెడ్డి, ఎలక్ట్ గవర్నర్ మైథిలీ మనోహర్‌రెడ్డి, బాసం శేషగిరిరావు, నలుబోలు బలరామయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో నలుగురు సిఐల బదిలీ

నెల్లూరుజిల్లాలో నలుగురు సిఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజి సంజయ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇస్కపల్లి మెరైన్ సిఐగా పనిచేస్తున్న సుబ్బారావును బుచ్చిరెడ్డి పాళెంకు, అక్కడ పని చేస్తున్న గంగా వెంకటేశ్వర్లును ఒంగోలు పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. నెల్లూరు రెండవ నగర ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సుధాకర్‌రెడ్డిని సిసిఎస్‌కు, అక్కడ పనిచేస్తున్న రామకృష్ణారెడ్డిని నెల్లూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

# 'అమ్మ' టెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

వస్తున్నారు. రేపు జరగరానిది జరిగితే ఆమె రాజకీయ వారసత్వం తమకే దక్కాలని పాకులాడుతున్నారు. ఇక తమిళ సినీహీరో అజిత్ పేరు కూడా ప్రచారంలోకి వచ్చింది. జయలలితను అజిత్ తన తల్లిలాగా చెప్పుకుంటుంటాడని, జయలలిత కూడా తన వారసుడిగా అజిత్ పేరుతో వీలునామా రాసి పెట్టిందన్న ప్రచారం చక్కర్లు కొడుతుంది. జయలలిత ఆరోగ్య సమాచారాన్ని బయట పెట్టాలంటూ డిఎంకె అధినేత కరుణానిధి డిమాండ్ చేస్తున్నారు. ఇలా ఉండగా రాష్ట్రంలో పరిపాలన స్థంభించిపోకుండా ఉండేందుకు జయలలిత నిర్వహిస్తున్న శాఖలను ఆర్థికమంత్రి పన్నీరుసెల్వంకు బదిలీ చేస్తూ ఇన్‌ఛార్జ్ గవర్నర్ సి.హెచ్.విద్యాసాగర్‌రావు సెక్షన్ 166 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు.

తమిళనాడు రాజకీయాల్లో కొనసాగుతున్న ఈ టెన్షన్ పర్వంలో కేంద్రప్రభుత్వం కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్డీఏ కూటమిలో లేనప్పటికీ బీజేపీకి అన్నాడిఎంకె పరోక్ష మద్దతుదారుగా వుంది. 2019ఎన్నికల్లో ఈ రెండు పార్టీల మధ్య పొత్తు పెట్టుకునే అవకాశం కూడా వుంది. జయలలిత ఆరోగ్యం దెబ్బతింటే, అన్నాడిఎంకె పార్టీనే విచ్ఛినమయ్యే పరిస్థితి. బీజేపీ దీనిని కోరుకోవడం లేదు. జయలలిత ఆరోగ్యం దెబ్బతిన్నా అన్నాడిఎంకె ప్రభుత్వాన్ని, పార్టీని నిలబెట్టాలన్నది బీజేపీ నేతల వ్యూహం. అందుకే జయకు ప్రత్యామ్నాయ నాయకత్వంపై సైతం బీజేపీ అగ్రనాయకత్వం దృష్టి పెట్టినట్లు సమాచారం. తమిళనాడు రాజకీయాల్లో జయ సస్పెన్స్ డ్రామాను ఇక ఎంతోకాలం కొనసాగించలేరు! ఆమె పరిస్థితి ఏంటి? ఆమె ఆరోగ్యం ఎలా ఉందన్న టెన్షన్‌కు త్వరలోనే తెరపడొచ్చు!



## సంబరాల సౌరభాలకి
## తృతీయ వార్షికోత్సవం

VPR 3rd Anniversary



ఆదరించి ఆశీర్వదిస్తున్న ప్రతి ఒక్కరికీ అభివందనాలు.

మీ.. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి




**వేడుక మీది... వేదిక మాది....**

ఎంగేజ్‌మెంట్స్, వెడ్డింగ్స్, రిసెప్షన్స్, బర్త్‌డేస్, సెమినార్స్ కాన్ఫరెన్సెస్, ఫ్యామిలీ ఫంక్షన్స్, గెట్-టుగెదర్స్

VPR CONVENTION CENTRE

గొలగమూడిరోడ్డు, కనుపర్తిపాడు, నెల్లూరురూరల్.
ఫోన్: 0861 - 6541414.



## శుభాకాంక్షలు

జనం కోసం జలం
నిరంతరం అదే ఆయన ఆరాటం
ప్రతిక్షణం దానికోసమే ఆయన పోరాటం
ఆ పోరాటం ప్రతి వ్యక్తికి కావాలి స్ఫూర్తిదాయకం
ఆయనే మా మిత్రుడు

**డా॥ సోమవరపు రవికుమార్‌రెడ్డి, సి.ఏ**
సెక్రటరి, రూరల్ ఎకనమిక్ & ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటి (REEDS)




ఆయన ఆధ్వర్యంలో నడుస్తున్న రీడ్స్ అనే స్వచ్ఛంద సేవా సంస్థకు
గ్రామీణ ప్రజల త్రాగునీటి అవసరాల కోసం తక్కువ ఖర్చుతో
సులభంగా నిర్వహించే త్రాగునీటి శుద్ధి యంత్రం
అభివృద్ధి చేసినందుకు గుర్తింపుగా ఇండియా టుడే
"వాటర్ వారియర్" - సఫాయిగిరి 2016
అవార్డును కేంద్ర పట్టణాభివృద్ధి శాఖా మంత్రి యం.వెంకయ్యనాయుడు
మరియు నటి ఐశ్వర్యరాయ్ చేతుల మీదుగా అందుకున్న శుభసందర్భంగా
ఇవే మా హృదయపూర్వక శుభాకాంక్షలు.

**టి.పద్మనాభరెడ్డి**
ప్రియాంక ఎంటర్‌ప్రైజస్, నెల్లూరు

**జి.వి.ప్రసాద్(బాబు)**
బాలాజీ అగ్రికెమ్, ఆదోని

**కె.రితేష్ కుమార్‌రెడ్డి**
మెడ్‌విజన్ ఐ & హెల్త్ కేర్ సెంటర్, హైదరాబాద్

**ఎస్.మధుసూదనరెడ్డి**
వి వెంచర్స్, హైదరాబాద్

**గండవరపు శ్రీనివాసులురెడ్డి**
హైదరాబాద్

**వి.మోహన్‌రెడ్డి**
మారుతి మోటార్స్, నెల్లూరు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com